తిరుమలకు అలిపిరి నడక దారిలో అక్రమ దుకాణాలు వెలుస్తున్నాయి. ఎకో డెవలప్‌మెంట్ కమిటీ పేరిట ప్రభుత్వ అటవీ శాఖ అనుమతులు జారీ చేస్తుండగా దుకాణాల ఏర్పాటుకు ఓ బడా మంత్రి అనుచరులు రంగంలోకి దిగుతున్నారు.అసలే వ్యాపారాలు తగ్గాయని వాపోతున్న టీటీడీ లైసెన్సుడు దుకాణదారులు వీరిని అడ్డుకుంటున్నారు. ఫలితంగా ఆందోళనలు, ఘర్షణలు తలెత్తుతున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి


కొద్దిరోజుల క్రితం నడకమార్గంలో ఏర్పాటైన మరో దుకాణం

అలిపిరి నడక దారిలో అక్రమ షాపులు!

- ఎకో డెవలప్‌మెంట్ కమిటీ పేరిట ప్రభుత్వ అటవీ శాఖ అనుమతులు
- షాపుల ఏర్పాటుకు రంగంలోకి దిగిన బడా మంత్రి అనుచరులు
- అడ్డుకుంటున్న టీటీడీ లైసెన్స్‌డ్ షాపుల నిర్వాహకులు

అలిపిరి మెట్ల దారిలో ఇప్పటి వరకూ టీటీడీ, దేవాదాయ శాఖలు మాత్రమే దుకాణాల ఏర్పాటుకు అనుమతులు ఇస్తున్నాయి.ఏడవ మైలు వద్ద మాత్రమే రెండు హోటళ్ళకు అటవీ శాఖ అనుమతులు ఇచ్చింది.అద్దెలు విపరీతంగా పెరిగిపోవడం, దానికి తగిన వ్యాపారం జరగక ఆ రెండు హోటళ్ళూ ఎప్పుడో మూతపడ్డాయి. తర్వాత వేలం పాటల్లో ఎవరూ పాల్గొనకపోవడంతో హోటళ్ళు తెరుచుకోలేదు. అలాంటిది ఇపుడు ఏకంగా 30 షాపులకు అనుమతులు జారీ చేసింది. 2397వ మెట్టు వద్ద, చిట్టెక్కుడు వద్ద హిమాచల్ ప్రదేశ్ దుకాణం ఎదుట, 7వ మైలు ప్రాంతంలో 2400వ మెట్టు, 35వ మలుపులో 2403, 2410, 2415వ మెట్ల వద్ద, 2425వ మెట్టు, జింకలపార్కు సమీపాన 2542వ మెట్టు వద్ద, 2450వ మెట్టు వద్ద, జింకల పార్కు పరిధి 2550వ మెట్టు వద్ద, 2597వ మెట్టు, 2610వ మెట్టు, 2625వ మెట్టు, 2655వ మెట్టు, జింకల పార్కు మండప సమీపాన 2660 మెట్టు, 7వ మైలు ప్రాంతంలోని మండపం దగ్గర 2687వ మెట్టు, 2726వ మెట్టు, 2735వ మెట్టు, దొరసాని మండపం సమీపాన 2760వ మెట్టు, దొంగల మండపం సమీపాన 2796వ మెట్టు, అటవీ శాఖ సరిహద్దు లైను సమీపాన 2814వ మెట్టు, 2815వ మెట్టు, 2825వ మెట్టు, వ్యూ పాయింట్ సమీపాన 2832వ మెట్టు, ఎన్ఎస్ టెంపుల్ సమీపాన 2851, 2866వ మెట్ల వద్ద, కొత్త మండపం సమీపాన 2931వ మెట్టు, 7వ మైలు మండపం వద్ద రెండు, 7వ మైలు మ్యూజియం వద్ద ఒకటి చొప్పున మొత్తం 30 షాపులకు అటవీ శాఖ అనుమతి ఇచ్చింది.వీటితో కొందరు అర్ధరాత్రిళ్ళు స్తంభాలు నాటి ఇనుప రేకులతో తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసేందుకు యత్నిస్తున్నారు. ఈ ప్రయత్నాలు జింకలపార్కు, ఏడవ మైలు ప్రాంతాల్లో ఉద్రిక్తతలకు కారణమవుతున్నాయి. ఇప్పటికే అక్కడ టీటీడీ నుంచీ లైసెన్సు పొందిన వ్యాపారులు దుకాణాలు నిర్వహిస్తున్నారు. వీరికి గతంలో తిరుమలలో లేపాక్షి నుంచీ సీఆర్వో వరకూ సబ్‌వేలో దుకాణాలుండేవి. అయితే అక్కడ వ్యాపారం జరగకపోవడంతో లక్కీ డిప్ ద్వారా అలిపిరి నడక దారిలో టీటీడీ దుకాణాలు కేటాయించింది . అయితే అక్కడ కూడా వ్యాపారాలు పెద్దగా సాగడం లేదు. కాలినడక భక్తులకు ఉచిత దర్శన టోకెన్లు అలిపిరిలోనే జారీ చేస్తుండడంతో నడక దారిలో వెళ్ళే భక్తుల సంఖ్య గణనీయంగా తగ్గింది. దీంతో ఆ దారిలో వ్యాపారాలూ తగ్గాయి. దానికి తోడు చిన్నారులపై చిరుత పులులు దాడులు జరపడంతో అటవీ శాఖ అధికారులు తినుబండారాల విక్రయాలు వద్దని ఒత్తిడి పెంచారు. నడకదారి భక్తుల సంఖ్యా తగ్గింది. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో వున్న లైసెన్సుడు దుకాణదారులకు అటవీ శాఖ ద్వారా దొడ్డిదారిన షాపుల ఏర్పాటుకు కొందరు ప్రయత్నించడం కడుపు రగిలేలా చేస్తోంది. గత పదిరోజుల్లో పలు మార్లు కొత్త వ్యక్తులు దుకాణాల ఏర్పాటుకు యత్నించడం పాత దుకాణదారులు వాటిని కూల్చేయడం జరుగుతోంది. తాజాగా గురువారం కూడా కొత్తవ్యక్తులు కూలీలను పెట్టి దుకాణాలు ఏర్పాటు చేస్తుండగా పాత వ్యాపారులు వాటిని అడ్డుకుని కూల్చివేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే అక్కడ ఘర్షణలు కూడా తలెత్తే ప్రమాదం కనిపిస్తోంది.


ఏడవమైలు వద్ద నిర్మించిన దుకాణాన్ని తొలగిస్తున్న పాత దుకాణదారులు

ఎవరీ షాపులు దక్కించుకున్నవారు?

అలిపిరి నడక దారిలో 30 షాపులు ఎకో డెవలప్ మెంట్ కమిటీ సభ్యుల పేరిట కేటాయింపులు జరిగాయి. బి.సుబ్రమణ్యం రెడ్డి, బి.శోభారాణి, ఎం.చంద్రబాబు, ఎస్.కృష్ణయ్య, ఎం.చంద్రశేఖర్, కె.వినోద్‌కుమార్, ఆర్.దీపిక, ఎన్.జయమ్మ, పి.హంస, ఎం.బాబు, సౌందర్య, జి.విజయ, సి.పద్మరాణి, ఎం.సుబ్రమణ్యం, ఆర్.నరసింహులు, వై.రాజశేఖర్, కె.లక్ష్మీదేవి, వై.హరిబాబు, సి.నాగరాజ, సి.మునిరాజ, బి.రేఖ, జి.చెంచెలక్ష్మి, వై.అనసూయమ్మ, వై.చండీప్రియ, వి.మదనమోహన్‌రెడ్డి, వి.వెంకటేశ్వర్లు, ఎం.పుష్పవేణి, వి.కృష్ణప్రసాద్‌రెడ్డి, డి.వెంకటేశులు పేర్లతో షాపులకు అనుమతులు జారీ అయ్యాయి. అసలు వీరంతా ఎవరో, ఎక్కడి వారో, వీరు ఎకో డెవలప్‌మెంట్ కమిటీలో సభ్యులుగా ఎలా చేరారో పరిశీలించాల్సి వుంది. వీరంతా సదరు మంత్రి అనుచరులన్న ప్రచారం వుంది.వీరెవరికీ టీటీడీ నుంచీ అనుమతులు లేకపోయినా దుకాణాలు ఏర్పాటు చేసుకుంటూండడం గమనార్హం.

తాము వద్దన్న పనిని తామే చేస్తున్న అటవీశాఖ

అలిపిరి నడక దారిలో చిన్నారులపై చిరుత పులులు దాడులు చేయడంపై అధ్యయనం జరిపిన వైల్డ్ లైఫ్ అటవీ శాఖ ఉన్నతాధికారులు పలు అంశాలను గుర్తించారు. నడక దారి పొడవునా దుకాణాల్లో తిను బండారాలు విక్రయిస్తుంటారు. గతంలో జింకల పార్కు వున్నందున జింకలకు పాదచారులు తినుబండారాలు అలవాటు చేశారు. వాటికోసం జింకలు గుమిగూడేవి. అవి తినగా మిగిలే వ్యర్థాలను, నడక దారి భక్తులు పడేసే వ్యర్థాలు, దుకాణాల్లో మిగిలిపోయిన ఆహార పదార్థాల వ్యర్థాలు కూడా అక్కడే పోగుపడుతున్నాయి. ఈ వ్యర్థాల కోసం ఎలుగుబంట్లు రావడం మొదలైంది. మరోవైపు జింకల కోసం చిరుత పులులు మాటేయడానికి అలవాటు పడ్డాయి. కాలక్రమంలో జింకల పార్కు ఎత్తేసినా అలవాటు పడిపోయిన జింకలన్నీ ఆ ప్రాంతంలోనే ఎక్కువగా సంచరిస్తున్నాయి. ఈ కారణంగానే చిరుతలు మెట్ల దారి వద్దకు వచ్చి మాటేయడం, అందుబాటులో చిన్నారులు కనిపించినపుడు దాడి చేసి లాక్కెళ్ళడం జరుగుతోంది. అటవీ శాఖ ఉన్నతాధికారుల పరిశీలనలో ఇదే అంశాన్ని గుర్తించి ఆ ప్రాంతంలో తినుబండారాలు విక్రయించే దుకాణాలు ఎత్తివేయాలని సిఫారసు చేశారు.అదే అటవీ శాఖే ఇపుడు తినుబండారాల దుకాణాల ఏర్పాటుకు అనుమతులివ్వడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది.పైగా 7వ మైలు ప్రాంతంలో దుకాణాల ఏర్పాటుకు అనుమతివ్వడమే నిబంధనలకు విరుద్ధమన్న వాదన వినిపిస్తుండగా దానికి ఎంచుకున్న మార్గం కూడా మరింత అక్రమంగా కనిపిస్తోంది. తిరుపతి జిల్లా అటవీ శాఖాధికారి జి.సతీష్ దీనిపై గతేడాది నవంబరు 10వ తేదీన టీటీడీ ఈవోకు రాసిన లేఖలో అలిపిరి నడక దారిలోని 7వ మైలు ప్రాంతంలో ఎకో డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు తమ జీవనోపాధి కోసం తాత్కాలిక దుకాణాలు నడుపుతున్నారంటూ వాటి వివరాలు పేర్కొన్నారు. ఆ లేఖలోనే ఈ తాత్కాలిక దుకాణాలు 2018 నుంచీ నడుస్తున్నట్టు పేర్కొన్నారు. వాస్తవానికి అధికారికంగా అయినా అనధికారికంగా అయినా నడక దారిలో అటవీ శాఖకు దుకాణాలే లేవని సమాచారం. 7వ మైలు వద్ద కేవలం రెండు దుకాణాలు మాత్రమే వుండేవని అవి కూడా పదిహేనేళ్ళ కిందట మూతపడ్డాయని సమాచారం. అయినా 2018 నుంచీ 30 తాత్కాలిక దుకాణాలు నడుస్తున్నాయని బాధ్యత కలిగిన జిల్లాస్థాయి అధికారి టీటీడీకి నివేదించడం విమర్శలకు దారి తీస్తోంది.

తెర వెనుక అసలు సంగతేమిటంటే...

టీటీడీ వ్యవహారాల్లో ముఖ్యంగా కొండపైన అధికార పార్టీకి చెందిన ఇద్దరు కీలక నేతల నడుమ ఆరు నెలలుగా ఆధిపత్య పోరు సాగుతోంది. తన అనుచరులకు మేలు చేసేలా దుకాణాల ఏర్పాటు వంటి వాటికి ఓ బడా మంత్రి చేస్తున్న సిఫారసులను టీటీడీ బుట్టదాఖలా చేస్తోందని సమాచారం. దర్శనాలు మినహా మిగిలిన పాలనా వ్యవహారాల్లో, లబ్ధి కలిగే ఏ అంశంలోనూ మంత్రి మాట చెల్లుబాటు కావడం లేదని వైసీపీ వర్గాల్లోనూ, టీటీడీ వర్గాల్లోనూ ప్రచారమవుతోంది. ఈ పరిణామాలతో ఆగ్రహించిన మంత్రి తనకున్న పలుకుబడి వినియోగించారని, దాంతో తిరుమలలో తన పరిధి కలిగివున్న ప్రభుత్వ అటవీ శాఖ తెర మీదకు వచ్చిందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అలిపిరి, శ్రీవారి మెట్టు నడక దారుల్లో కొన్ని ప్రాంతాలు, అలాగే కొండపైన పాపనాశనం వంటి చోట్ల కొన్ని ప్రాంతాలు ప్రభుత్వ అటవీ శాఖ పరిధిలో వున్నాయి. పాపనాశనం వద్ద ఆ శాఖ అనుమతితో ఎప్పటి నుంచో దుకాణాలు నడుస్తున్నాయి. గతంలో 7వ మైలు వద్ద రెండు దుకాణాలు ఆ శాఖ అనుమతితో నడిచేవి.వ్యాపారం జరగక మూతపడ్డాక వాటిని పునరుద్ధరించలేదు.ఈ నేపథ్యంలో మంత్రి ఒత్తిడితోనే అటవీ శాఖ అధికారులు 2018నుంచీ ఎకో డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులైన 30మందికి తాత్కాలిక దుకాణాలు నడక దారిలో వున్నట్టు నిర్ధారించి టీటీడీ ఈవోకు లేఖ రాయడం వివాదాస్పదంగా మారుతోంది.

టీటీడీ భద్రత, పర్యవేక్షణ ఏమైందో శ్రీవారికెరుక!

టీటీడీ భద్రత, పర్యవేక్షణల్లో లోపాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. తాజాగా అలిపిరి నడక దారిలో కొత్త దుకాణాల ఏర్పాటుకు జరుగుతున్న యత్నాలే దానికి నిదర్శనం. అలిపిరి చెక్ పాయింట్ నుంచీ కొండపైదాకా ఇటు నడక దారిలోనూ, అటు ఘాట్ రోడ్లలోనూ, కొండపైనా ఎక్కడ చీమ చిటుక్కుమన్నా టీటీడీకి తెలియాలి. దానికి తగ్గ భద్రతా, నిఘా వ్యవస్థ దేవస్థానానికి వుంది. అయితే అలిపిరి నడక దారిలో పట్టపగలు, అలాగే అర్ధరాత్రిళ్ళు తాత్కాలిక దుకాణాలు ఏర్పాటవుతున్నా టీటీడీకి తెలియకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. దుకాణాల ఏర్పాటుకు నిర్మాణ సామగ్రి టీటీడీ భద్రతా, నిఘా వ్యవస్థల కంట పడకుండా 7వ మైలు దాకా ఎలా చేరుతోందన్నది ప్రశ్న. అనుమతులు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేస్తుంటే నిరంతరం నడక దారిపై నిఘా వేసి వుంచే విజిలెన్స్ యంత్రాంగానికి ఎందుకు తెలియడం లేదన్నది మరో ప్రశ్న. చివరికి అక్కడ పాత దుకాణదారులకు, కొత్తగా వస్తున్న వారికి గొడవలు జరుగుతున్నా కూడా టీటీడీ అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేయకపోవడం అనుమానాలకు తావిస్తోంది.మంత్రి ఒత్తిడితో సంబంధిత వ్యవస్థ చూసీచూడనట్టు వ్యవహరిస్తోందని భావించాల్సివస్తోంది.


ముక్కంటి ఆలయంలో బారులు తీరిన భక్తులు

యంత్రాంగం... వీఐపీలకు దాసోహం

- ఇబ్బడి ముబ్బడిగా పాసుల జారీ
- కాసులు కురిపించిన స్థానికుల టికెట్లు

శ్రీకాళహస్తి, మార్చి 8: ముక్కంటి శివరాత్రి ఉత్సవాల్లో సామాన్య భక్తులకు ఇక్కట్లు తప్పలేదు.వీఐపీలకు ఆహ్వానం పలికేందుకు ఎన్నడూ లేని విధంగా కొత్త షెడ్డును నిర్మించారు.పెద్దఎత్తున అధికారులు నిరీక్షణలు సాగించారు.అలాగే వీఐపీల కోసం ప్రత్యేకంగా దక్షిణ గోపుర మార్గాన్ని కేటాయించారు.అధికార యంత్రాంగమంతా వీఐపీల సేవలోనే తరించడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు.ఆలయంలో కూడా క్యూలైన్ల నిర్వహణ ఈసారి భక్తులకు అసంతృప్తిని కలిగించింది. గురుదక్షిణా మూర్తి వద్ద అడ్డదారిలో వచ్చే వారు క్యూలైన్లలో కలిసి పోయారు. స్వామి వారి గడప వద్ద ఎమ్మెల్యే , వైసీపీ పరివారం గర్భగుడిలో తిష్ట వేశారు. అయిన వారిని అంతరాలయంలోకి తీసుకెళ్తూ వారి సేవలో తరించారు. కొందరు వైసీపీ కార్యకర్తలు క్యూలైన్ల పైకి ఎక్కి దూకుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరించారు.అమ్మవారి సన్నిధిలో కూడా సామాన్య భక్తులకు తీవ్ర నిరాశే ఎదురైంది. ప్రతిసారీ అమ్మవారి ఎదురుగా సింహ వాహనం వరకు క్యూలైన్ సాగేది. ఈసారి అంతకన్నా వెనుక వైపున రాశి చక్రం కింద అందులోనూ తక్కువ ఎత్తులో క్యూలైన్ ఏర్పాటు చేశారు. ముందు వరసలో అయిన వారు, అంతరాలయంలోకి వెళుతూ వస్తూ సాగారు. ఎక్కడో రాశి చక్రం దగ్గర నుంచి దూరంగా కనిపించీకనిపించనట్టుగా సామాన్య భక్తులు అమ్మవారిని దర్శించుకోవాల్సి వచ్చింది. మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద ఆలయం పైనుంచి భక్తులు వెలుపలకు వెళ్లేలా క్యూ లైన్ ఏర్పాటు చేశారు. కానీ ఆ కొండలాంటి మెట్లు ఎక్కే మార్గంలో సామాన్య భక్తులు తప్ప ఎవరూ నడవలేదు.చాలామందికి మృత్యుంజయ ఆలయం వద్ద గేట్లు తెరిచి మరీ పదే పదే మహాద్వారం నుంచి వెలుపలకు పంపారు. దీంతో యధావిధిగా కంచు గడప వద్ద క్యూలైన్ స్తంభించడం పటుమార్లు జరిగింది.ట్రాఫిక్ నియంత్రణ మాత్రం ఈసారి మెరుగ్గా నిర్వహించారు. కొన్నిచోట్ల అవసరం లేకపోయినా ఎక్కువ కట్టడి చేశారు. పొన్నాలమ్మ ఆలయం వద్ద ద్విచక్ర వాహనదారులు, పోలీసుల మధ్య పలుమార్లు వాగ్వాదం చోటు చేసుకుంది. శివరాత్రి పాసులు ఇష్టారాజ్యంగా జారీ చేశారు. వైట్ కాలర్ ముసుగులో పాసులు పొందిన కొందరు దళారులు అత్యంత రద్దీ సమయంలో కూడా అడ్డదారిలో దర్శనాలకు ఎగబడ్డారు.స్థానికుల కోటా టికెట్లను కొందరు దళారులు యధేచ్ఛగా దుర్వినియోగం చేశారు. రూ.500 క్యూ లైన్‌లో పంపే టికెట్లను స్థానికుల కోసం ఒకరోజు ముందు 200 రూపాయలకే జారీ చేసిన విషయం తెలిసిందే. పథకం ప్రకారం కొందరు గురువారమే టికెట్లు కొనుగోలు చేసి శుక్రవారం 500రూపాయల దాకా అమ్ముకున్నట్లు సమాచారం.


భక్తులను దాటుకుని గేటు దూకుతున్న వైసీపీ కార్యకర్త

సర్వం...శివోహం


నంది, సింహ వాహనాలపై ఆదిదంపతుల విహారం

శ్రీకాళహస్తి, మార్చి 8: మహాశివరాత్రి సందర్భంగా ఈశ్వరాలయాలన్నీ శుక్రవారం భక్తులతో పోటెత్తాయి.దక్షిణ కైలాసంగా వర్ధిల్లుతున్న ముక్కంటి ఆలయంలో ఉదయం పలుచగా కన్పించినా 11గంటల నుంచీ మొదలైన రద్దీ రాత్రి వరకూ కొనసాగింది.అప్పుడప్పుడూ తోపులాటలు కూడా జరిగాయి. స్వర్ణముఖి నదిలో పుణ్యస్నానాలు.. పితృదేవతలకు తర్పణాలు జోరుగా సాగాయి. శివ రాత్రిని పురస్కరించుకుని వాయులింగేశ్వరుడు నిజమూర్తి రూపంలో దర్శనమిచ్చారు.రోజూ నాలుగు అభిషేకాలు జరిగితే శివరాత్రి వేళ ఉదయం 5 గంటల నుంచి 10 గంటల వరకు ప్రథమ, ద్వితీయ కాలాభిషేకాలు, ఉచ్చి కాలాభిషేకంతో పాటు మరో మూడు కాలాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 4 గంటల నుంచి 6గంటల వరకూ ప్రత్యేకంగా మూడు కాలాల అభిషేకాలు జరిగాయి.అర్ధరాత్రి తరువాత 2 గంటలకు 10వ కాల అభిషేకం (శుద్ధి అభిషేకం) 4.30 గంటలకు 11వ కాల అభిషేకం(బ్రహ్మాభిషేకం) జరిగాయి.శుక్రవారం వేకువజామున 2 గంటలకు గోపూజ నిర్వహించాక గోమాత స్వామి అమ్మవార్లను మొదట దర్శించుకుంది. సుప్రభాత సేవ తరువాత 3 గంటల నుంచీ భక్తులను దర్శనానికి అనుమతించారు. రుద్రాభిషేకంతో పాటు పచ్చకర్పూరాభిషేకం, పంచామృతాభిషేకాలతో స్వామివారు నిత్యాభిషేక మూర్తిగా దర్శనమిచ్చారు. జ్ఞానప్రసూనాంబిక దేవికి కూడా వివిధ రకాల అభిషేకాలు నిర్వహించారు.రాజగోపురం సమీపం నుంచి సామాన్య భక్తుల ఉచిత దర్శనానికి, రూ.50 టికెట్టు కొనుగోలుచేసిన వారికి క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయం లోపల మహాలఘుదర్శన విధానం అమలు చేశారు.ప్రత్యేక దర్శన టిక్కెట్టు రూ.500, స్థానికుల టికెట్టు కొనుగోలు చేసిన వారిని 3వ నంబరు గేటు (తిరుమంజన గోపురం) వైపు నుంచి అనుమతించారు. దర్శనానంతరం భక్తులను బయటకు పంపడానికి మృత్యుంజయ లింగం వద్ద నుంచి ఆలయం పైకి వెళ్లి భక్తకన్నప్ప కొండ మెట్ల మార్గం వద్దకు చేరుకునేలా ప్రత్యేక మార్గం ఏర్పాటు చేసి మహాద్వారం వైపు రాకుండా చర్యలు తీసుకున్నారు.


శుక్రవారం అర్ధరాత్రి నందిసేవకు హాజరైన భక్తజనం


ఇంద్ర విమానం, చప్పరంపై ఆదిదంపతుల పురవిహారం

నయనోత్సవం నంది సేవనం

శ్రీకాళహస్తీశ్వరుడి నందిసేవ శుక్రవారం రాత్రి నయనోత్సవంగా సాగింది.శివరాత్రి జాగరణ చేసే భక్తుల కోసం ఆదిమధ్యాంత రహితుడైన సర్వేశ్వరుడు తనకు ఎంతో ప్రీతికరమైన నందిపై దివ్యదర్శనమిచ్చారు. ఊరేగింపును తిలకించేందుకు... జాగరణ చేసి మొక్కులు తీర్చుకునేందుకు తరలివచ్చిన భక్తులతో శ్రీకాళహస్తీశ్వరాలయం, మాడవీధులు కిక్కిరిసిపోయాయి.జ్ఞానప్రసూనాంబా దేవి సింహవాహనాన్ని అధిరోహించి అనుసరించారు.ఉదయం శ్రీకాళహస్తీశ్వరుడు ఇంద్ర విమానంపై, జ్ఞానప్రసూనాంబదేవి చప్పరంపై అధిరోహించి పురవిహారం చేశారు. మూషిక వాహనంపై వినాయకస్వామి, చప్పరాలపై శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, చండికేశ్వరుడు, భక్తకన్నప్ప ముందుసాగగా దివ్యాభరణాల ధగధగలతో పురవిహారం చేస్తున్న పార్వతీ పరమేశ్వరులను దర్శించుకోవడానికి వచ్చిన భక్తులతో చతుర్మాడవీధులు నిండిపోయాయి. ఊరేగింపులో ప్రదర్శించిన కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.


సాంస్కృతిక ప్రదర్శనల్లో శ్రీకాళహస్తికి చెందిన ఆషా నృత్యవిన్యాసం

అమ్మవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



ఆలయం వద్ద సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సందీప్ మెహతా

తిరుచానూరు, మార్చి 8: తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సందీప్ మెహతా దర్శించుకున్నారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, అర్చకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

తిరుచ్చిపై పద్మావతిదేవి విహారం



తిరుచానూరు, మార్చి 8: తిరుచానూరులో కొలువైన పద్మావతి అమ్మవారు బంగారు తిరుచ్చిపై శుక్రవారం ఆలయ మాడవీధుల్లో విహరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, శేషగిరి, శ్రీవాణి, అర్చకులు బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గణేష్, సుభాస్కర్‌నాయుడు, అశోక్, అర్చకులు పాల్గొన్నారు.

వైభవంగా మహాశివరాత్రి వేడుకలు



రామచంద్రాపురం, మార్చి 8: రాయలచెరువు కట్ట భవానీ జలకంఠేశ్వరస్వామి, అనుపల్లి జన్మస్థల శివాలయంలో శుక్రవారం మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. మధ్యాహ్నం శివపార్వతుల ఊరేగింపు జరిగింది. సాయంత్రం మృత్యుంజయ హోమం, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. రాత్రి12గంటలకు తిరుమంజన అనంతరం లింగోద్భవ దర్శనం జరిగింది. తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు.

సిద్ధేశ్వరతీర్థంలో టీటీడీ చైర్మన్, ఈవో

మహాశివరాత్రి సందర్భంగా సి.రామాపురం వద్ద ఉన్న సిద్ధేశ్వర తీర్థం (బ్రహ్మర్షి గురూజీ ఆశ్రమంలో) నిర్వహిస్తున్న వేడుకల్లో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి పాల్గొన్నారు. స్ఫటిక శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్రమపీఠాధిపతి బ్రహ్మర్షి గురవానంద , ప్రకాష్ శెట్టి, బాబులాల్,ఆశీష్ మెహతా, కొఠారి తదితరులు పాల్గొన్నారు.

అర్ధనారీశ్వరుడిగా చాముండేశ్వరిదేవి



తిరుపతి(రూరల్), మార్చి 8: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తుమ్మలగుంటలోని శక్తి చాముండేశ్వరిదేవి శుక్రవారం అర్ధనారీశ్వరుడి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త బీరుదాల భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ● ఎల్ఎస్‌నగర్‌లోని భ్రమరాంబిక మల్లికార్జున దేవాలయంలో స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయధర్మకర్తలు ఎ.చెంగారెడ్డి, ఎ.ఉమాపతిరెడ్డి, రామలింగాచారి, రాజుపిళ్లై, మేనేజర్ లీలాప్రకాష్, బాలయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ● పైడిపల్లెలో లింగేశ్వర స్వామి, సి.గొల్లపల్లెలో ప్రసన్న పార్వతి సమేత నీలకంఠేశ్వరస్వామి, మల్లంగుంటలో శ్రీరామ నందీశ్వరస్వామి, చిగురువాడలో స్వర్ణముఖి దేవాలయం, దుర్గసముద్రంలో నాగలింగేశ్వరస్వామి, అవిలాలలో పరాశరేశ్వరస్వామిని, సాయినగర్‌లో శివాలయాన్ని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ ఆలయాలను తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సందర్శించి పట్టు వస్త్రాలను సమర్పించారు. అలాగే రూ.30వేల విలువచేసే మైక్‌సెట్లని అందించారు. కాగా అవిలాలలోని పరాశరేశ్వరస్వామికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి దంపతులు సారె సమర్పించి దర్శనం చేసుకున్నారు.

పరాశరేశ్వరస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



సారె తీసుకెళుతున్న ఎమ్మెల్యేచెవిరెడ్డి భాస్కరరెడ్డి

తిరుచానూరు, మార్చి 8: మహాశివరాత్రి సందర్భంగా తిరుచానూరు యోగిమల్లవరంలోని కామాక్షాంబ సమేత పరాశరేశ్వర స్వామి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. ఆలయం వద్ద తిరుచానూరు సర్పంచ్ కె.రామచంద్రారెడ్డి, ఆలయ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం, మజ్జిగ పంపిణీ చేశారు. ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయడంతో భక్తులు ఇబ్బంది పడకుండా స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆదివారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం జరుగుతుందని అర్చకులు తెలిపారు. అలాగే ముండ్లపూడిలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలోనూ మహాశివరాత్రి వేడుకలను నిర్వహించారు.

పైడిపల్లెలో యోగాశ్రమభవనం ప్రారంభం

తిరుపతి(రూరల్), మార్చి 8: పైడిపల్లెలోని మాస్టర్ సీవీవీ యోగాశ్రమ భవనాన్ని శుక్రవారం తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రారంభించారు. వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, ఆశ్రమ ఎండీ సరోజిని, నిర్వాహకులు లక్ష్మీమూర్తి, శ్రీనివాసాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారం

పాకాల, మార్చి 8: పదకొండేళ్ల తమ కుమార్తెపై శుక్రవారం చంద్ర అనే 30 యేళ్ల వ్యక్తి అత్యాచారానికి పాల్పడినట్లు బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాకాల మండలం మొగరాల పంచాయతీ పరిధిలో వుంటోన్న తాము ఇంట్లో లేని సమయంలో ఈ ఘటన జరిగిందని చెప్పారు. పోలీసుల విచారణలో వాస్తవాలు తెలియాల్సి వుంది.

హిందూ ఉద్యోగులపై వివక్ష తగదు



నిరసన తెలుపుతున్న మహేష్

తిరుపతి(విద్య), మార్చి 8 : ఏపీలో హిందూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపడం తగదని హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ దేగల పేర్కొన్నారు. కార్తీక, మార్గశిర మాసాల్లో ప్రత్యేకంగా హిందువులు పలు భక్తి ఆరాధనా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారని, ఈ క్రమంలో విధులకు గంట ఆలస్యంగా హాజరయ్యేందుకు అనుమతించాలని కోరినా పాలకులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. రంజాన్ మాసంలో ముస్లింలకు ప్రార్థనా నిమిత్తం ప్రతి శుక్రవారం గంట సమయం మినహాయింపు ఇవ్వడం సరికాదని తెలిపారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి కార్తీక, మార్గశిర మాసాల్లో హిందూ ఉద్యోగులకు గంట పాటు ప్రత్యేక అనుమతిచ్చేలా చర్యలు చేపట్టాలని కోరుతూ శుక్రవారం తిరుపతిలో ప్లకార్డు చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు.

చంద్రగిరి రైల్వేస్టేషన్‌లో మహిళా సిబ్బందికి సత్కారం



చంద్రగిరి, మార్చి 8: మహిళా దినోత్సవం సందర్భంగా చంద్రగిరి రైల్వేస్టేషన్‌లోని మహిళా సిబ్బందిని ఓబీసీ ఫోరం రాష్ట్ర కన్వీనర్ బడి సుధాయాదవ్ సన్మానించారు కేక్ కట్ చేయించి అందరికి పంచిపెట్టారు. అనంతరం స్వీట్లు, చీరలు పంపిణీ చేశారు.చంద్రగిరి పంచాయతీ కార్యాలయంలో మన సంస్కృతి సేవా ట్రస్ట్ రెండో వార్షికోత్సవం సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ హరినాథ రెడ్డి చంద్రగిరి సర్పంచ్ రూపారామ్మూర్తిని సన్మానించి, మహిళా కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈవో మహేశ్వరయ్య, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుబ్రమణ్యం యాదవ్ పాల్గొన్నారు.

చెవిరెడ్డి అవినీతి బాగోతం విప్పుతా

● ఇంటింటి ప్రచారంలో పులివర్తి నాని



మహిళలను సన్మానిస్తున్న పులివర్తి నాని

తిరుచానూరు, మార్చి 8: 'చంద్రగిరి నియోజకవర్గం అభివృద్ధే నా ధ్యాస, ఊపిరి' అని టీడీపీ ఇన్‌చార్జి పులివర్తి నాని అన్నారు. శుక్రవారం మీ ఇంటి వద్దకు మీ పులివర్తి నాని, బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా తిరుపతి రూరల్ మండలం ముండ్లపూడి గ్రామంలో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. ఐదేళ్లుగా నియోజకవర్గంలో అరాచకపాలనను ప్రజలందూ గమనిస్తున్నారని అన్నారు. ఎర్రచందనం, ఇసుక, మఠంభూములు, గంజాయి అమ్మకాలు, దౌర్జన్యాలు, భూకబ్జాలు, తిరగబడితే కేసులు తప్ప ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి చేసిన అభివృద్ధి ఏమి లేదన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజవర్గాన్ని గాడిలో పెట్టి, ఎమ్మెల్యే అవినీతి బాగోతం విప్పుతానని స్పష్టం చేశారు. ఇక వైసీపీ ప్రభుత్వంపై రోజురోజుకు వస్తున్న వ్యతిరేకతను గమనించి ప్రజలను తప్పుదోవ పట్టించాలని సిద్ధం అంటూ సభలు పెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రాభివృద్ధి జరగాలంటే చంద్రబాబును సీఎం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈకార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సృష్టికి మూలం మహిళ

సృష్టికి మూలం మహిళ అని చంద్రగిరి టీడీపీ ఇన్‌చార్జి పులివర్తి నాని అన్నారు. తిరుపతి రూరల్ మండలం ముండ్లపూడిలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్నికల వేళ..మరో ఏడాది

● శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొనసాగింపు
● కొంతమందిని తొలగించి...మరి కొందరికి అవకాశం



పాలకమండలితో ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి

శ్రీకాళహస్తి, మార్చి 8: శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి పాలనా కాలాన్ని మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పాలక మండలి చైర్మన్‌గా అంజూరు శ్రీనివాసులు కొనసాగగా పలువురు సభ్యులను తొలగించి కొత్తవారికి అవకాశం కల్పించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో వుంచుకుని ప్రధానంగా పట్టణంలో బీసీ, బలిజ కులాల ఓట్లను ఆకర్షించేలా బోర్డులో పలువురు సభ్యులకు అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది.ఎమ్మెల్యే మధుకు అనుకూలంగా ఉన్న వారందరికీ బోర్డులో తిరిగి స్థానం దక్కగా కొత్తగా ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ దివంగత శ్రీరామమూర్తి అన్న కొండుగారి కృష్ణకుమార్‌కు అవకాశం కల్పించారు. అలాగే నాయీ బ్రాహ్మణులకు సంబంధించి ఆవులపాటి శ్రీనివాసులు, అరుణామెడికల్స్ అధినేత సుబ్బరామగుప్తాకు చోటు కల్పించారు. గతంలో ఉన్న ముగ్గురిని తొలగించి ప్రత్యేక ఆహ్వానితులుగా తొమ్మిదిమందిని నియమించారు. వీరిలో గతంలో టీడీపీలో మాజీ కౌన్సిలరుగా ఉన్న కంఠా ఉదయ్ కుమార్‌కు ప్రత్యేక ఆహ్వానితులుగా అవకాశం ఇచ్చారు. ట్రస్ట్‌బోర్డులో ఈసారి అవకాశం వస్తుందని ఆశించిన పలువురికి నిరాశే మిగిలింది. ఆర్థికంగా ఉన్నవారికే బోర్డులో పదవులు ఇవ్వడంపై అధికార పార్టీలోనూ అసంతృప్తి వ్యక్తం అవుతోంది. కాగా ఈ మండలికి శివరాత్రి బాగా కలిసొచ్చింది.రెండేళ్ల క్రితం ఫిబ్రవరి 28న అర్ధరాత్రి ముక్కంటి ఆలయానికి ధర్మకర్తల మండలిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పక్కరోజు మార్చి 1న అంజూరు శ్రీనివాసులు చైర్మన్‌గా మండలి ప్రమాణస్వీకారం చేసింది. సరిగ్గా మళ్లీ శుక్రవారం శివరాత్రి రోజున మండలిలో మార్పులు, చేర్పులతో ఏడాది కాలం పొడిగిస్తూ జీవో వెలువడింది. గతంలో లాగే అదే తరహాలో శివరాత్రి రోజున సాయంత్రం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ప్రమాణస్వీకారం జరిగింది.

జమ్మూ కశ్మీర్ గవర్నర్‌కు స్వాగతం



రేణిగుంట, మార్చి 8: జిల్లాలో రెండ్రోజుల పర్యటన నిమిత్తం శుక్రవారం మధ్యాహ్నం జమ్మూ కశ్మీర్ గవర్నర్ మనోజ్ సిన్హా తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు కలెక్టర్ లక్ష్మీశ స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన ముక్కంటి దర్శనానికి వెళ్లారు. శనివారం తిరుమలలో శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణం కానున్నారు. ఎస్డీసీ భాస్కర్‌నాయుడు, లైజన్ అధికారి లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

కలకలం రేపిన సూసైడ్ సెల్ఫీ వీడియో

పోలీసుల అప్రమత్తతతో యువకుడు క్షేమం



నిరంజన్‌ను కుటుంబసభ్యులకు అప్పచెబుతున్న పోలీసులు

వెంకటగిరి, మార్చి 8: వెంకటగిరి మండల పరిధిలోని వెలుగొండల్లో వున్న కోనమల్లేశ్వరస్వామి కోనకు వెళ్లే అటవీ ప్రాంతంలో ఓ యువకుడు నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకొంటున్నట్లు సెల్ఫీ వీడియో తీసి కుటుంబ సభ్యులకు పంపి కలకలం సృష్టించాడు. వెంకటగిరి పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలంలోని దుర్గసముద్రం గ్రామానికి చెందిన నిరంజన్ గురువారం కోన మల్లేశ్వరస్వామి కోన అటవీ ప్రాంతానికి చేరుకున్నాడు. అక్కడ ఓ కొండపై కూర్చొని నిద్రమాత్రలు మింగుతూ సెల్ఫీ వీడియో తీసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు కుటుంబ సభ్యులకు వీడియోను వాట్సప్ ద్వారా పంపాడు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే చిత్తూరు పోలీసులు వెంకటగిరి పోలీసులకు సమాచారం ఇచ్చి అప్రమత్తం చేశారు. వెంకటగిరి ఎస్ఐ సుధాకరరెడ్డి హుటాహుటిన సిబ్బందిని వెంటబెట్టుకొని కోన మల్లేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే అటవీ మార్గానికి చేరుకొన్నారు. నిద్రమాత్రలు మింగి మత్తులోకి జారుకున్న నిరంజన్‌ను జీపులో ఎక్కించుకుని వెంకటగిరి తీసుకువచ్చారు. నిద్రమాత్రల మోతాదు తక్కువగా వుండడంతో ప్రాణాపాయం లేదని పోలీసులు తెలిపారు. ఇంట్లో గొడవ పడి వచ్చి ఆత్మహత్యకు యత్నించానని ఆ యువకుడు చెప్పాడు. శుక్రవారం అతడిని కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు.





శ్రీదేవిభూదేవి సమేత కల్యాణ వెంకన్నకు స్నపన తిరుమంజనం - పుష్కరిణిలో చక్రత్తాళ్వార్‌కు చక్రస్నానం - స్నానమాచరిస్తున్న భక్తులు

వైభవంగా చక్రధారుడి చక్రస్నానం

చంద్రగిరి, మార్చి8:శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామికి చక్రస్నానం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం చక్రత్తాళ్వార్‌తోపాటు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీహరి ఉత్సవర్లను పల్లకిపై మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం కంకణ భట్టర్ శేషాచార్యుల ఆధ్వర్యంలో ఉత్సవర్లకు స్నపనతిరుమంజనం నిర్వహించారు. శ్రీవారి ఆయుధమైన చక్రత్తాళ్వార్‌కు అభిషేకం చేసి చక్రస్నానం చేయించారు. సాయంత్రం తిరుచ్చి ఉత్సవం, తర్వాత ధ్వజావరోహణ ఘట్టం నిర్వహించారు. దీంతో కల్యాణ వెంకన్న ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిసాయి. ఆలయ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, వైఖానస ఆగమ సలహాదారులు మోహనరంగాచార్యులు, సూపరింటెండెంట్లు మునిచెంగల్రాయులు, వెంకటస్వామి, అర్చకులు పాల్గొన్నారు.

అశ్వవాహనంపై విహరించిన ఎల్లమ్మ



చంద్రగిరి, మార్చి 8: చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మ అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం ఉదయం అమ్మవారి ఉత్సవమూర్తిని అలంకరించి అశ్వవాహనంపై పిచ్చినాయుడుపల్లెకు ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఓ మామిడి తోటలో కొలువుదీర్చగా గ్రామస్తులు పూజలు చేశారు. సాయంత్రం చంద్రగిరిలోని ఆలయానికి అమ్మవారు చేరుకున్నారు. ఆలయ చైర్మన్ యారాశి చంద్రశేఖరరెడ్డి, ఈవో తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సిద్ధేశ్వర స్వామి కల్యాణోత్సవం



తాళిబొట్టు చూపుతున్న వేదపండితుడు



భక్తులకు అన్నదానం

ఎర్రావారిపాలెం, మార్చి 8 : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా తలకోన సిద్ధేశ్వర స్వామి కల్యాణోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ప్రధాన అర్చకుడు ప్రసన్న స్వామి ఆధ్వర్యంలో వేద పండితులు ఆలయ కల్యాణ మండపంలో సిద్ధేశ్వరి సమేత సిద్ధేశ్వర స్వామికి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు.ఈవో జయకుమార్, చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు నాగిరెడ్డి, మంజుల, గంగోజీ, మధుసూదన్, జయంత్, రాజేశ్వరి పాల్గొన్నారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తలకోన సిద్ధేశ్వర స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆయన వెంట తుడా చైర్మన్ మోహిత్ రెడ్డి ఉన్నారు. స్థానిక దాతలు విరివిగా అన్నదాన కేంద్రాలు, తాగునీరు, మజ్జిగ వితరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మాకలరేవు వద్ద వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించారు. మండల టీడీపీ,జనసేన నాయకుల ఆధ్వర్యంలో మజ్జిగ వితరణ, పులిహోర పంపిణీ చేపట్టారు.

టీడీపీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం



పాకాల, మార్చి 8: స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కె.సావిత్రి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. టీడీపీ నాయకులు చాముండేశ్వరి, గౌతమి, అరుణ, నందీశ్వరి, బి.నాగరాజనాయుడు, ఫల్గుణ కుమార్, ఎ.బాలాజీ, గోకుల్, రమేష్, రెడ్డిప్రసాద్ భరత్ తదితరులు పాల్గొన్నారు.




ముక్కోటిలో స్వామి, అమ్మవారు



కిటకిట లాడుతున్న భక్తులు



పాకాల బజారు వీధిలో శివ లింగానికి పూజలు

అంతటా శివనామస్మరణే

చంద్రగిరి, మార్చి 8: మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం భక్తుల శివనామస్మరణలతో శివాలయాలు మార్మోగాయి. తొండవాడ అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి 7 గంటలకు పార్వతీపరమేశ్వరుల ఉత్సవ మూర్తులను నంది వాహనంపై అధిష్ఠించి ఊరేగించారు. అదేవిధంగా చంద్రగిరిలో వెలసిన శ్యామలాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో, అనంతగుర్రప్పగారిపల్లె-పాండురంగయ్యగారిపల్లె మార్గంలో వెలసిన సప్త రుషీశ్వర తీర్థం(తీర్థాల కోన)లో భక్తులు పూజలు నిర్వహించారు.

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలంలోని కట్టకింద భీమేశ్వర స్వామి ఆలయం, నెమలిగుండ్ల శివాలయం, తిప్పిరెడ్డిగారిపల్లె శివాలయంలో శుక్రవారం ఉదయం స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. చెరువు కట్ట కింద ఉన్న భీమేశ్వర స్వామి, మాణిక్యాంబకు కల్యాణోత్సవం నిర్వహించారు.

పాకాల : మండలంలోని గాంధీనగర్, సూరినేనిపల్లె, కొండేపల్లె, నేలదానిపల్లె, ఇరుగు రంగయ్యగారిపల్లె, కెవడ్డేపల్లె, ఇరంగారిపల్లె శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రగిరివారిపల్లెలో జ్యోతి వెలిగించి భజనలు చేశారు. శంఖంపల్లె చంద్రమౌళీశ్వర ఆలయంలో పార్వతీపరమేశ్వరులకు పూజలు నిర్వహించారు. పాకాల బజారువీధిలో ఓం శాంతి బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో శివలింగానికి పూజలు నిర్వహించారు.

సిద్ధం సభకు స్కూల్ బస్సులు పంపాల్సిందే

● నేటి మధ్యాహ్నం ఎస్వీయూ గ్రౌండుకు చేర్చండి
● విద్యాసంస్థల మెడపై రవాణా అధికారుల కత్తి

తిరుపతి రూరల్,మార్చి 8: ఒంగోలులో ఆదివారం నిర్వహించే వైసీపీ సిద్ధం సభకు బస్సులు పంపాల్సిందేనని రవాణాశాఖ అధికారులు ప్రైవేట్ స్కూళ్ల, కళాశాలల యాజమాన్యాలపై ఒత్తిడి తెస్తున్నారు. ఫోన్లు చేసి మీకు ఇన్ని బస్సులు ఉన్నాయి.. అందులో సగం పంపాల్సిందేనంటున్నారని పలువురు విద్యాసంస్థల యాజమానులు వాపోతున్నారు. స్కూల్ బసులను రాజకీయ సమావేశాలకు పంపరాదన్న హైకోర్టు ఆదేశాలను ప్రస్తావించినా ఖాతరు చేయడం లేదంటున్నారు. అంతదూరం బస్సులు పంపలేమని, దాదాపు 400కి.మీ పైగా జనాలను తీసుకెళ్లి వెనక్కి తీసుకురావడం చాలా కష్టంగా ఉంటుందని డ్రైవర్లు అంటున్నారని చెబితే వారిని తమవద్దకు పంపండి... కౌన్సిలింగ్ ఇస్తామంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.తమ పర్సనల్ పనుల కోసం పంపమని అడగడంలేదని, పై అధికారులు ఒత్తిడి చేస్తుండడంతోనే అడుగుతున్నామని ఆర్టీఏ అధికారులు కూడా యాజమాన్యాల వద్ద నిస్సహాయత వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది.బస్సులను పంపకపోతే ఇబ్బంది పడతారంటూ బెదిరిస్తున్నారన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. గతనెల అనంతపురం జిల్లా రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభకు పంపితే డీజిల్‌కు సరిపడా నగదు కూడా ఇవ్వలేదని, బస్సులు పంపడమే కాకుండా డీజిల్, డ్రైవర్ బత్తాలకు కూడా తామే ఖర్చు పెట్టుకోవాల్సి వచ్చిందని విద్యాసంస్థల యజమానులు వాపోతున్నారు.శనివారం మధ్యాహ్నం 2గంటలలోపు ఎస్వీయూ క్రీడా మైదానం వద్ద బస్సులను అప్పగించాలని ఆర్టీఏ అధికారులు హుకుం జారీచేయడంతో ఏమిచేయాలో తెలియక నలిగిపోతున్నారు.దాదాపు 400బస్సుల్లో సిద్ధం సభకు జనాలను తీసుకెళ్లనున్నట్లు సమాచారం.

శ్రీవారి సన్నిధికి దూరమై... మనసు భారమై

తిరుమల ఆలయ మహద్వారం ముంగిట విలపించిన టీటీడీ ఉద్యోగి



తిరుపతి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అది తిరుమల శ్రీవారి ఆలయ ప్రవేశ మార్గం... శుక్రవారం ఉదయం సుమారు 11 గంటల వేళ.... ఆలయం నుంచీ అర్చకుడిలా వున్న ఓ వ్యక్తి విషణ్ణ వదనంతో వెలుపలికి వచ్చారు... మహద్వారం ముంగిట సాష్టాంగ ప్రమాణం చేశారు... ఆపై లేచి నుంచుని పట్టరాని దుఃఖంతో అక్కడి నుంచీ నిష్క్రమించారు... ధారాపాతంగా కారుతున్న కన్నీటిని ఉత్తరీయంతో తుడుచుకుంటూ సాగిపోతున్న ఆయన్ను చూసి మీడియా ప్రతినిధులు ఏమి జరిగిందంటూ ప్రశ్నించినా సమాధానం చెప్పకుండా చేతులెత్తి నమస్కరించారు. ఏడుస్తూనే వీడియో తీయొద్దని వారిస్తూ ముందుకు సాగిపోయారు. శ్రీవారి ఆలయం నుంచీ విలపిస్తూ నిష్క్రమించిన ఆయన ఎవరా అని ఆరా తీస్తే బదిలీ కారణంగా భారమైన మనసుతో శ్రీవారి సన్నిధికి దూరమైన ఉద్యోగి గురురాజారావు అని తెలిసింది. టీటీడీలో 2002వ సంవత్సరం గురురాజారావు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హోదాలో ఆలయ విధుల్లో చేరారు. ఆపై బొక్కసం క్లర్కుగా తర్వాత బొక్కసం సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందారు. టీటీడీలో బొక్కసం సూపరింటెండెంట్ అన్న ఉద్యోగం కీలకమైనదే కాక సంక్లిష్టమైంది కూడా. ఆలయంలో శ్రీవారి బంగారు, వెండి ఆభరణాలన్నీ ఆయన ఆధీనంలోనే, పర్యవేక్షణలోనే వుంటాయి. శ్రీవారి మూల మూర్తికి అలంకరించే ఆభరణాలు, ఉత్సవ మూర్తులకు అలంకరించే నగలు కూడా ఆయనే బొక్కసం నుంచీ ఎంపిక చేసి తీసుకెళ్ళి ప్రధాన అర్చకులకు అప్పగించడం, వాటిని తొలగించాక తిరిగి బొక్కసానికి చేర్చి భద్రపరచడం ఆయన ప్రధాన విధి. ఈ విధుల్లో భాగంగా ఆలయంలో రోజువారీ స్వామివారికి జరిగే నిత్య కైంకర్యాలపైన, పూజలు, ప్రత్యేక పూజా పునస్కారాలమీద ఆయనకు విశేషమైన అనుభవం కూడా వుంది. నిత్యం అర్చకులకు సహకరించే క్రమంలో ఆయనకు రోజువారీ ఆలయంలో శ్రీవారి పూజా కైంకర్యాల గురించి సమగ్ర అవగాహన తెచ్చుకున్నారు. దానికి తోడు డాలర్ శేషాద్రి మరణించే వరకూ ఆయన వెన్నంటి వుండి శ్రీవారి దర్శనార్థమై వచ్చే మఠాధిపతులకు, పీఠాధిపతులకు కూడా ప్రీతిపాత్రుడయ్యారని సమాచారం. ఆలయ వ్యవహారాల్లో ఇటు అర్చకులకు, అటు అధికారులకు నడుమ సంధానకర్తగా వ్యవహరిస్తూ ఆలయ నిర్వహణలో కీలక వ్యక్తిగా మారారు. గత 20 ఏళ్ళలో టీటీడీలో పనిచేసిన ఉన్నతాధికారులందరి వద్దా మన్ననలు పొందారు.విధి నిర్వహణలో ఎలాంటి ఆరోపణలు, ఫిర్యాదులు కూడా లేవని, వివాద రహితుడిగా పేరుపడ్డారని తెలిసింది. అయితే ఆ క్రమంలో కొంతమంది అధికారుల ఈగో కారణంగా బొక్కసం సూపరింటెండెంట్ విధులకు దూరమైనట్టు తెలిసింది. 2020లో ఆయన్ను బొక్కసం సూపరింటెండెంట్‌గా తప్పించి తిరుమలలోనే వైభవోత్సవ మండపానికి బదిలీ చేశారు. శ్రీవారి బంగారం, వెండి ఆభరణాలు పర్యవేక్షించే బాధ్యతల నుంచీ తప్పించినా కనీసం తిరుమలలోనే విధులు కేటాయించినందుకు సంతోషిస్తూ అక్కడే విధుల్లో కొనసాగారు. అయితే బొక్కసం విధుల నుంచీ తప్పించడంతో సంతృప్తి చెందని కొందరు అధికారులు కక్షసాధింపుతో ఆయన్ను తాజాగా తిరుమల నుంచే బదిలీ చేయించారని సమాచారం. తిరుపతి టీటీడీ పరిపాలనా భవనంలోని అకౌంట్స్ విభాగానికి బదిలీ చేసినట్టు తెలిసింది. 22 ఏళ్ళుగా తిరుమలలో శ్రీవారి సన్నిధిలో గడిపిన ఆయన బదిలీ కారణంగా తిరుమల వీడాల్సి రావడంతో హతాశులయ్యారని సమాచారం. దీంతో శుక్రవారం విచార వదనంతో ఆలయం వీడిన ఆయన మహద్వారం ముంగిట శ్రీవారికి ప్రణమిల్లి కన్నీరు కారుస్తూ వైభవోత్సవ మండపం వైపు వెళ్ళిపోవడం చూపరులను కలచివేసింది. శ్రీవారి పట్ల, ఆలయ విధుల పట్ల ఆయనకున్న భక్తిప్రపత్తులు అక్కడున్న వారి మనసులను కదిలించింది.



రెండు రైల్వే అండర్ బ్రిడ్జిలకు నిధుల మంజూరు


కాటన్‌మిల్లు వద్ద ఉన్న రైల్వేగేటు

తిరుపతి(ఆటోనగర్) మార్చి 8 : తిరుపతి-రేణిగుంట మార్గం లోని రెండు రైల్వే అండర్ బ్రిడ్జిల నిర్మాణాలకు నిధులు మంజూరైనట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. హీరో హోండా షోరూం, కాటన్‌మిల్, పద్మావతి ఫ్లోర్‌మిల్ వద్ద మూడు రైల్వే గేట్లు ఉన్నాయి. వీటిలో కాటన్‌మిల్ వద్దనున్న గేట్‌ను శాశ్వతంగా మూతవేసి, మిగిలిన రెండుచోట్ల అండర్ బ్రిడ్జి నిర్మించేందుకు రూ.18 కోట్లు మంజూరయ్యాయని, టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. తద్వారా నగరంలో ట్రాఫిక్‌సమస్య కొంత మేరకు తగ్గుతుందని వివరించారు.

ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోండి

నార్నె వెంకటసుబ్బయ్య


సమావేశంలో మాట్లాడుతున్న నార్నె వెంకటసుబ్బయ్య

తిరుపతి (ఆటోనగర్), మార్చి 8: వరదయ్యపాళెం మండలంలోని కల్కి ఆశ్రమం ఆధీనంలో గల 3.74 ఎకరాల ప్రభుత్వ భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని ఏపీ హేతువాద సంఘం నాయకులు నార్నె వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ 16 ఏళ్లుగా 3.74 ఎకరాల ప్రభుత్వ భూములు కల్కి ఆశ్రమం పరిధిలో ఉన్నాయని, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో హైకోర్టులో వ్యాజ్యం వేశామని తెలిపారు. గత జనవరి పదవ తేదీన హైకోర్టు ఆ స్థలం ప్రభుత్వానిదేనని తీర్పు ఇచ్చినా అధికారులు స్వాధీనం చేసుకోకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఈ కేసులో అక్రమాలకు పాల్పడిన ఆశ్రమ పీఠాదిపతి విజయకుమార్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారులు స్పందించని పక్షంలో కోర్టులో కంటెంట్ కేసు వేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో హేతువాద సంఘ నాయకులు డి.కోటేశ్వర్‌రావు, రామ్మూర్తిరెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై వెంటనే తీర్పు ఇవ్వాలి


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకుడు గిరిధర్

తిరుపతి (ఆటోనగర్) మార్చి 8 : ఎస్సీ వర్గీకరణపై వెంటనే తీర్పు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి జి.గిరిధర్ కోరారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఏపీలో మాదిగలకు అన్యాయం జరుగుతోందని, ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ప్రభుత్వాలను అభ్యర్థించినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టును ఆశ్రయించగా త్రిసభ్య బెంచ్ గతనెల 5నుంచి 8వ తేదీ వరకు విచారణ జరిపి తీర్పును రిజర్వు చేసిందని, వెంటనే వెల్లడిస్తే తమ సామాజిక వర్గానికి రాజకీయంగా లబ్ధి చేకూరుతుందని వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ అయితే తమకు ప్రాధాన్యత ఇస్తుందో వారి విజయానికి కృషి చేస్తామని ప్రకటించారు. ఈ సమావేశంలో నాయకులు జి.వరదరాజులు, పి.సుబ్బయ్య. మురళి, రాజు, వెంకటముని, ప్రశాంతి, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి అభిషేకం



తిరుమల, మార్చి8 (ఆంధ్రజ్యోతి) : తిరుమల గోగర్భం డ్యాంకు సమీపంలోని క్షేత్రపాలకుడికి శుక్రవారం వైభవంగా అభిషేకం చేశారు. తిరుమల క్షేత్రానికి పాలకుడిగా ఉన్న రుద్రుడికి మహాశివరాత్రి సందర్భంగా ఏటా అభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శ్రీవారి ఆలయం నుంచి ఆలయ మర్యాదలతో అధికారులు, అర్చకులు క్షేత్రపాలక శిల వద్దకు చేరుకున్నారు. పాలు, పెరుగు, చందనం, పన్నీరు, కొబ్బరినీళ్ల తదితర ద్రవ్యాలతో అభిషేకించారు. నైవేద్యం సమర్పించి, భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. అంతకుముందు తిరుమల స్థానికులు, వ్యాపారులు క్షేత్రపాలకుడికి ప్రత్యేక అభిషేకం, అలంకరణలు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో టీటీడీ మాజీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, మహారాష్ట్ర ఎంపీ శ్రీకాంత్‌షిండే ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

'భీమా' పెద్ద విజయం సాధిస్తుంది

హీరో గోపీచంద్



తిరుమల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : తను హీరోగా నటించిన భీమా చిత్రం తప్పకుండా పెద్ద విజయం సాధిస్తుందని హీరో గోపీచంద్ అన్నారు. శుక్రవారం ఉదయం చిత్ర దర్శకుడు హర్ష, సభ్యులతో కలిసి ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. భీమా చిత్రం విడుదల సందర్భంగా స్వామి ఆశీస్సులు తీసుకున్నామన్నారు. కాగా, గోపీచంద్‌ను చూసేందుకు అభిమానులు ఉత్సాహం చూపారు. సెల్ఫీలు తీసుకున్నారు.

ఎమరాల్డ్స్‌లో ఆకట్టుకున్న స్పార్క్ పోటీలు



అక్షితకు చెక్కు అందిస్తున్న ఎమరాల్డ్స్ డైరెక్టర్లు

తిరుపతి (విద్య), మార్చి 8 : ఎల్‌ఐసీ రోడ్డులోని ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు స్పార్క్-2కే24 పేరిట నిర్వహించిన స్పీచ్ పోటీలు ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా విద్యార్థులకు వీడియో ప్రజంటేషన్, ఎక్స్ టెంపోర్, గ్రూప్ డిస్కషన్ వంటి విభాగాల్లో పోటీలు నిర్వహించారు. బీకాం ప్రథమ సంవత్సర విద్యార్థి అక్షిత ప్రథమ స్థానంలో నిలిచి రూ.5వేల నగదు బహుమతి అందుకుందని అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్.మునిరత్నం పేర్కొన్నారు. బీబీఏ విద్యార్థి రుక్సాణ ద్వితీయ స్థానం సాధించి రూ.3వేల నగదు, బీఎస్సీ విద్యార్థి శ్రావణి తృతీయ స్థానం సాధించి రూ.వెయ్యి నగదు బహుమతి అందుకుందని తెలిపారు. విజేతలకు డైరెక్టర్లు గిరిధర్, విశ్వనాథ్ నగదు బహుమతి, షీల్డు, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. న్యాయనిర్ణేతగా వ్యక్తిత్వ వికాస నిపుణులు శ్రీరాం బాబు వ్యవహరించారు. ప్రిన్సిపాల్స్ జాఫర్‌వల్లీ, అధ్యాపకులు సుధాకర్, భానుకిరణ్, గ్రేస్‌వినీల పాల్గొన్నారు.

11న రెజ్లింగ్ జిల్లా జట్ల ఎంపిక

తిరుపతి అర్బన్, మార్చి 8: శ్రీనివాస క్రీడా సముదాయంలో ఈ నెల 11న జిల్లాస్థాయి అండర్ 20 బాలబాలికల రెజ్లింగ్ జట్లను ఎంపిక చేయనున్నట్లు రెజ్లింగ్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్.సురేష్, కార్యదర్శి ఉదయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 2004, 2005, 2006 సంవత్సరాల్లో జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. ఆధార్, పదవ తరగతి మార్కుల జాబితా జిరాక్స్ తీసుకురావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9000024837ను సంప్రదించాలని కోరారు.

తిరుపతి పార్లమెంటు వైసీపీ కో ఆర్డినేటర్‌గా పెద్దిరెడ్డి

తిరుపతి క్రైం, మార్చి 8 : అనంతపురం, హిందూపురం, చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గాల వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్న సీనియర్ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి తిరుపతి పార్లమెంటు బాధ్యతలు కూడా అప్పగించారు. ఇప్పటి వరకు తిరుపతిని పర్యవేక్షించిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తుండటంతో ఆ బాధ్యతలను మంత్రి పెద్దిరెడ్డికి కేటాయించారు.

జీవలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలు


ప్రత్యేక అలంకరణలో జీవలింగేశ్వరస్వామి - జంబుకేశ్వరస్వామి

తిరుపతి (రవాణా), మార్చి 8: నగర పరిధిలోని జీవకోనలో వెలసిన జీవలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజాము 2గంటలకు పార్వతీ సమేత జీవలింగేశ్వరస్వామికి పంచామృత అభిషేకం చేశారు. 6 గంటలకు సర్వదర్శనం అమలు చేశారు. వేలాది మంది భక్తులు జీవలింగేశ్వరుడిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ సురేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

జంబుకేశ్వరస్వామి ఆలయంలో..

మంగళం జంబుకేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము 4 గంటలకు గోపూజ, రుద్రాభిషేకం, అర్చనలు చేశారు. స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం 4 గంటలకు రుద్రాభిషేకం, 7 గంటలకు భరతనాట్యం, రాత్రి 10 గంటలకు హరికథా కాలక్షేపం, 11.30 గంటలకు లింగోద్భవ అభిషేక దర్శనం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పల్లికొండేశ్వరస్వామికి పట్టువస్త్రాల సమర్పణ

తిరుమల, మార్చి8(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని సురుటపల్లిలోని పల్లికొండేశ్వరస్వామికి టీటీడీ తరపున శుక్రవారం పట్టువస్త్రాలు సమర్పించారు. ఏటా మహాశివరాత్రికి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శ్రీవారి ఆలయ పారుపత్తేదార్ ఉమామహేశ్వరరెడ్డి, వేదపారాయణదారులు పట్టువస్త్రాలను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకెళ్లారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి, వారికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రారెడ్డి, ఆలయ పాలకమండలి చైర్మన్ బాలాజీరెడ్డి, ఈవో శరవణ పాల్గొన్నారు.


భోగి తేరుపై కపిలేశ్వరస్వామి - నందివాహన సేవ - కపిలతీర్థంలో భక్తుల రద్దీ

అంతా శివమయం

ఘనంగా మహాశివరాత్రి వేడుకలు
శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తజనం

తిరుపతి (కల్చరల్), మార్చి 8 : మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం తిరుపతి నగరం శివనామస్మరణతో మార్మోగింది. శివాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. కపిలేశ్వరాలయంలో తెల్లవారుజాము నుంచే భక్తుల సందడి కనిపించింది. స్వామి దర్శనం కోసం బారులుతీరారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు స్వామి వారికి అభిషేక సేవ చేశారు. సాయంత్రం 6నుంచి విశేష దీపారాధన జరిగింది. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామి అమ్మవార్లకు నంది వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. సుబ్బరాజు నాట్యకళా పరిషత్ తిరుపతి వారి ఆధ్వర్యంలో జరిగిన పార్వతీకల్యాణం నాటక ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఈ ఉత్సవాల్లో ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్ర బాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి పాల్గొన్నారు. ఉత్సవాలలో భాగంగా శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు పురుషామృగ వాహన సేవ నిర్వహిస్తారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల మధ్య కల్యాణోత్సవం ఉంటుంది. రాత్రి 8 నుంచి 10 గంటల వరకు తిరుచ్చి ఉత్సవం ఉంటుంది.

మంచినీళ్లకుంట ఆలయంలో..

తిరుపతి నరసింహతీర్థం రోడ్డు మంచినీళ్లకుంట వద్ద వెలసిన కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. రాత్రి శివపార్వతుల కల్యాణం జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు విశ్వేశ్వరుని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ధర్మకర్త రాళ్లపల్లి రామమూర్తి, ప్రధాన అర్చకుడు సూర్యనారాయణ మూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఘనంగా బృహదీశ్వరాలయ కుంభాభిషేకం



తిరుపతి (కల్చరల్), మార్చి 8: ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఆవరణలోని ధ్యానారామంలో ఉన్న బృహదీశ్వరస్వామి ఆలయ కలశస్థాపన, కుంభాభిషేకం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. శ్రీవాణి ట్రస్టు ఆధ్వర్యంలో టీటీడీ నిర్మించిన ఈ ఆలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో గణపతి పూజ. పుణ్యాహవచనం, పంచగవ్యారాధన, రుద్విక్ వరణం, మృత్సంగ్రహణం, అంకురార్పణం, వాస్తు హోమం, జలాధివాసం, నవరత్న, ధాతున్యాసాలు నిర్వహించారు. టీటీడీ పాలకమండలి అధ్యక్షుడు కరుణాకరరెడ్డి, జేఈవో వీరబ్రహ్మం, వేద విశ్వవిద్యాలయం ఉప కులపతి రాణి సదాశివమూర్తి, సీఏవో శేష శైలేంద్ర, రిజిస్ట్రార్ రాధాగోవింద త్రిపాఠి పాల్గొన్నారు. కాగా పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలకు అనుబంధంగా ఉన్న విద్యార్థుల వసతి గృహసముదాయంలో నూతనంగా నిర్మించిన భవనాన్ని, సంస్కృత విశ్వవిద్యాలయం మార్గంలోని తిరుపతి ఆఫీసర్స్ క్లబ్ ఆవరణలో నూతనంగా నిర్మించిన అతిథి భవనాన్ని శుక్రవారం కరుణాకరరెడ్డి ప్రారంభించారు.

11న ఈత కొలను ప్రారంభం

తిరుపతి అర్బన్, మార్చి 8 : శ్రీనివాస క్రీడా సముదాయంలో శాప్ ఆధ్వర్యంలో నడుస్తున్న స్విమ్మింగ్‌పూల్(ఈతకొలను)ను సోమవారం ప్రారంభించనున్నారు. వేసవి ప్రారంభం కావడంతో పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి, నూతన హంగులతో ముస్తాబు చేశారు. స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8121777077ను సంప్రదించాలని జిల్లా క్రీడాధికారి ఎస్.సయ్యద్‌సాహెబ్ కోరారు.

ఫీజు, సమయాల వివరాలిలా...

- పిల్లలకు అడ్మిషన్ ఫీజు (నాన్ రీఫండబుల్) రూ.1,500, నెలకు ఫీజు రూ.1,000
- పెద్దలకు అడ్మిషన్ (ఫీజు నాన్ రీఫండబుల్) రూ.2,500, నెలకు ఫీజు రూ.1,500
- శాప్ అకౌంట్లో క్యూఆర్ కోడ్ ద్వారా ఫీజు నగదు చెల్లించాలి.
- స్విమ్మింగ్ జామర్, తలకు క్యాప్, 2ఫొటోలు, ఆధార్ జిరాక్స్ తీసుకురావాలి.
- మహిళలకు ఉదయం 5-6, పురుషులకు ఉదయం 6-7, 7-8 గంటల మధ్య, సాయంత్రం 4-5, 5-6, 6-7స్లాట్స్ కేటాయించారు.
- ఓ కోచ్, ఇద్దరు లైఫ్ గార్డ్స్ అందుబాటులో ఉంటారు.

12న ఉద్యోగ మేళా

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 8: పద్మావతీపురంలోని సబ్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ కార్యాలయంలో ఈనెల 12న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జూనియర్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి వెంకటరమణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీలో రీటైల్ ట్రైనీ అసోసియేట్ లేదా ఫార్మసిస్టు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 30 వయసు కలిగి 10, ఇంటర్, డిప్లమో, డిగ్రీ, ఎంఫార్మా, బీఫార్మా, డీ ఫార్మా అర్హత కలిగిన స్త్రీ, పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. నెలకు జీతం రూ.13,500 నుంచి రూ.20 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8121015844ను సంప్రదించాలని కోరారు.

పిరమిడ్ ధ్యానమందిరాల ప్రారంభం

తిరుపతి (కల్చరల్), మార్చి 8: తిరుపతి జిల్లా పూడి సమీపంలోని అప్పలాయగుంట మార్గంలో ఉన్న పత్రీజీ ధ్యానాశ్రమ ఆవరణలో నిర్మించిన మూడు పిరమిడ్‌లను శివరాత్రి సందర్భంగా శుక్రవారం ప్రారంభించారు. కలెక్టర్ లక్ష్మీశ, సహాయ కలెక్టర్ భాస్కర నాయుడు, విజీవో బాలిరెడ్డి దంపతులు, తిరుపతి స్పిరుచువల్ సొసైటీ అధ్యక్షుడు కంచి రఘురాం, ప్రసన్న, సంగీత బాబు తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

భాష్యం స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే


గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో టీచర్లు

తిరుపతి(విద్య), మార్చి 8 : న్యూబాలాజి కాలనీలోని భాష్యం స్కూల్(జెడ్‌సీవో)లో ఒకటి నుంచి ఐదు తరగతులు చదివే ప్రైమరీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్‌డే, వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కాన్వొకేషన్ దుస్తులు ధరించి ముఖ్య అతిథులుగా వచ్చిన ఎస్వీయూ గణితశాస్త్ర విభాగ హెచ్‌వోడీ ప్రొఫెసర్ సుగుణమ్మ, ఎస్వీయూ సీఐ మురళీమోహన్ చేతుల మీదుగా గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకుని మంచి పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జోనల్ ఇన్‌చార్జి లక్ష్మణ్‌రావు, ప్రిన్సిపాల్ టి.నేతాజి, చాంప్స్ ఇన్‌చార్జి దీప పాల్గొన్నారు.

మహిళా సాధికారతను వైసీపీ మంటగలిపింది


కేక్ కట్ చేస్తున్న టీడీపీ, జనసేన మహిళా నేతలు

తిరుపతి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మహిళా సాధికారతను వైసీపీ మంటగలుపుతోందని టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అన్నారు. శుక్రవారం ఆమె నివాసంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. టీడీపీ-జనసేన మహిళా నాయకులు కేక్ కట్‌చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఆమె మాట్లాడుతూ నేటి కాలంలో ఉన్నత స్థానంలో ఉన్న మహిళలను చూస్తే సంతోషంగా ఉందన్నారు. మహిళా సాధికారతకు టీడీపీ పెద్దపీట వేస్తోందన్నారు. వైసీపీ నేతలు రాష్ట్రంలో ఉన్న 13 మహిళా ప్రాంగణాల ఉనికే లేకుండా చేశారని మండిపడ్డారు. తిరుచానూరు రోడ్డులోని మహిళా ప్రాంగణం వ్యాపార కేంద్రంగా మారిపోయిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ-జనసేన మహిళా నేతలు భట్టే వెంకట కీర్తి, బ్యాంకు శాంతమ్మ, సుభాషిణి, కుమారమ్మ తదితరులు పాల్గొనగా పార్టీ నాయకులు ఆర్సీ మునికృష్ణ, కొండా రాజమోహన్, రామ్మూర్తి రాయల్, బుల్లెట్ రమణ, సుబ్రమణ్యం పాల్గొన్నారు. అనంతరం ఆర్కాట్ కృష్ణప్రసాద్ నేతృత్వంలో ఏర్పాటైన బలిజ సేన లోగోను సుగుణమ్మ ఆవిష్కరించారు.

సీఏవోలో మహిళా దినోత్సవం


కేక్ కట్ చేస్తున్న మహిళా చార్టర్డ్ అకౌంటెంట్స్ - సుజాతను సన్మానిస్తున్న స్థానికులు

తిరుపతి అర్బన్, మార్చి 8: అఖిల భారత చార్టర్డ్ అకౌంటెంట్ తిరుపతి శాఖ కార్యాలయంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తిరుపతి శాఖ అధ్యక్షుడు జి.రవీంద్రరెడ్డి మహిళా చార్టర్డ్ అకౌంటెంట్స్‌కు శుభకాంక్షలు తెలిపి, కేక్ కట్ చేయించి, సత్కరించారు. ఉపాధ్యక్షులు బి.వి.మధుసూదనబాబు, కార్యదర్శి మన్నెం సిహాద్రినాయుడు, పూర్వ అధ్యక్షుడు జగదీష్‌కృష్ణ పాల్గొన్నారు.

- **తిరుపతి మదర్‌థెరిసాకు సన్మానం :** అనాథల పాలిట మదర్‌థెరిస్సాగా పేరు తెచ్చుకున్న శివజ్యోతినగర్‌కు చెందిన జి.సుజాతను స్థానికులు సన్మానించారు.
- **సెట్విన్ ఆధ్వర్యంలో :** కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈలో విద్యార్థినులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి, ప్రతిభా చూపిన వారిని సన్మానించారు. సెట్విన్ సీఈవో మురళీకృష్ణ మాట్లాడుతూ ఆదునిక కాలంలో పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నారని కొనియాడారు. సెట్విన్ మేనేజర్ మోహన్‌కుమార్, ప్రముఖ వ్యాపారవేత్త శిశిబిందు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో మహిళలదే కీలకపాత్ర



సభలో మాట్లాడుతున్న డైరెక్టర్ శివప్రసాద్‌రెడ్డి

తిరుపతి(ఆటోనగర్) మార్చి 8 : సమాజంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని ఏపీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. తిరుపతి సదరన్ డిస్కం కార్పొరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. వేడుకలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, దేశ భద్రతలోనూ కీలకంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. విద్యుత్ సంస్థలోనూ అన్ని విభాగాల్లో సేవలు అందిస్తున్నారని తెలిపారు. సీజీఎం జె.రమణాదేవి మాట్లాడుతూ మహిళలు ఇంటా బయట రాణిస్తుండడం సంతోషం కలిగించే అంశమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జీఎం శారద, పే ఆఫీసర్ గాయత్రిబాయి, ఈఈ హేమలత, డీవైఈఈ వాసవీలత పాల్గొన్నారు.

రుయాస్పత్రిలో కలెక్టర్ తనిఖీలు


కంటి పరీక్షలు చేయించుకుంటున్న కలెక్టర్ లక్ష్మీశ

తిరుపతి సిటీ, మార్చి 8 : రుయాస్పత్రిలో కంటి వైద్య సేవలు బాగున్నాయని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన కంటి విభాగాన్ని పరిశీలించి, కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం పలు విభాగాలను తనిఖీ చేసి, ఆస్పత్రిలోని వైద్య పరికరాలను, రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామని, రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంప్యూటర్ ఆపరేటర్లు, వైద్య పరికరాల అవసరం ఉందని, పరిష్కారం చూపాలని సూపరింటెండెంట్ రవిప్రభు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. డీఎంహెచ్‌వో శ్రీహరి పాల్గొన్నారు.

సంస్కృత వర్సిటీ స్నాతకోత్సవానికి హాజరుకండి

కేంద్రమంత్రి ధర్మేంద్రప్రధాన్‌కు ఆహ్వానపత్రిక అందజేత


కేంద్ర విద్యాశాఖ మంత్రికి జ్ఞాపిక అందజేస్తున్న ఎన్ఎస్‌యూ వీసీ

తిరుపతి (రూరల్), మార్చి 8: త్వరలో నిర్వహించే సంస్కృత వర్సిటీ స్నాతకోత్సవానికి హాజరు కావాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి కోరారు. ఈ మేరకు ఆహ్వాన పత్రిక అందజేశారు. శుక్రవారం న్యూఢిల్లీలోని మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఇటీవల వర్సిటీలో నిర్వహించిన ఉత్కల పీఠం రజతోత్సవానికి ఆన్‌లైన్‌లో పాల్గొన్న మంత్రిని అభినందించారు. అలాగే వర్సిటీ స్నాతకోత్సవానికి హాజరుకావాలని కోరారు. ఉత్కలపీఠం డైరెక్టర్ జ్ఞానరంజనపండా పాల్గొన్నారు.

నేటినుంచి ఆర్గానిక్ మేళా

తిరుపతి రూరల్, మార్చి 8 : యూత్ హాస్టల్ క్రీడామైదానం వేదికగా కనెక్ట్-2 ఫార్మర్ రైతుల సంస్థ ఆధ్వర్యంలో శనివారం నుంచి సోమవారం వరకు ఉదయం 6.30నుంచి రాత్రి 8గంటల వరకు ఆర్గానిక్‌మేళా నిర్వహించనున్నట్లు సంస్థ నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యధిక పోషకాలు కల్గిన దేశవాళీ ముడిబియ్యం, సిరిధాన్యాలు, గానుగ నూనెతో రూపొందించిన అల్పాహార, మధ్యాహ్న భోజన పదార్థాలు, నూనెలేని సాత్విక ఆహార ఉత్పత్తులు, సంప్రదాయ పద్ధతుల్లో తయారు చేసిన ఆరోగ్యకర, రుచికరమైన లైవ్ ఫుడ్ కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ మేళాలో రైతులు నేరుగా తమ ఆర్గానిక్ పంట ఉత్పత్తులను అమ్ముకునే అవకాశం కల్పిస్తున్నామని, అలాగే రెండు తెలుగు రాష్ట్రాలకు(ఆంధ్ర, తెలంగాణ) చెందిన 12 మంది నేతన్నలు తమ చేనేత సంతని ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. పిల్లల కోసం సంప్రదాయ యుద్ధకళ కలరీ, ఇంట్లో తయారు చేసుకునే కంపోస్ట్ నిర్వహణపై అవగాహనతో పాటు పెన్ కళంకారీపై వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా తొలిరోజు శనివారం రైతులకు మొక్కల గ్రాఫ్టింగ్, ఐదు అంచెల పంట విధానంపై శిక్షణ నిర్వహిస్తున్నామని, ఆసక్తి ఉన్న రైతులు 6303606326 (వాట్సాప్)లో పేరు నమోదు చేసుకోవాలని, 11న గృహిణులకు నిర్వహించే సిరిధాన్యాలతో వంటల పోటీల కోసం 8309145655(వాట్సాప్)లో పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ రైతులు తమస్టాళ్ల ఏర్పాటు కోసం 7981955245, 9133077050లను సంప్రదించాలని కోరారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

కలకలం రేపిన సూసైడ్ సెల్ఫీ వీడియో
పోలీసుల అప్రమత్తతతో యువకుడు క్షేమం


నిరంజన్‌ను కుటుంబసభ్యులకు అప్పచెబుతున్న పోలీసులు

వెంకటగిరి, మార్చి 8: వెంకటగిరి మండల పరిధిలోని వెలుగొండల్లో వున్న కోనమల్లేశ్వరస్వామి కోనకు వెళ్లే అటవీ ప్రాంతంలో ఓ యువకుడు నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకొంటున్నట్లు సెల్ఫీ వీడియో తీసి కుటుంబ సభ్యులకు పంపి కలకలం సృష్టించాడు. వెంకటగిరి పోలీసుల కథనం మేరకు... చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలంలోని దుర్గసముద్రం గ్రామానికి చెందిన నిరంజన్ గురువారం కోనమల్లేశ్వరస్వామి కోన అటవీ ప్రాంతానికి చేరుకున్నాడు. అక్కడ ఓ కొండపై కూర్చొని నిద్రమాత్రలు మింగుతూ సెల్ఫీ వీడియో తీసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు కుటుంబ సభ్యులకు వీడియోను వాట్సప్ ద్వారా పంపాడు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే చిత్తూరు పోలీసులు వెంకటగిరి పోలీసులకు సమాచారం ఇచ్చి అప్రమత్తం చేశారు. వెంకటగిరి ఎస్‌ఐ సుధాకరరెడ్డి హుటాహుటిన సిబ్బందిని వెంటబెట్టుకొని కోనమల్లేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే అటవీ మార్గానికి చేరుకొన్నారు. నిద్రమాత్రలు మింగి మత్తులోకి జారుకున్న నిరంజన్‌ను జీపులో ఎక్కించుకుని వెంకటగిరి తీసుకువచ్చారు. నిద్రమాత్రల మోతాదు తక్కువగా వుండడంతో ప్రాణాపాయం లేదని పోలీసులు తెలిపారు. ఇంట్లో గొడవ పడి వచ్చి ఆత్మహత్యకు యత్నించానని ఆ యువకుడు చెప్పాడు. శుక్రవారం అతడిని కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు.

వైసీపీనుంచి టీడీపీలోకి ఆగని వలసలు



తొట్టంబేడు, మార్చి 8: వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు ఆగడం లేదు. శుక్రవారం శ్రీకాళహస్తి ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి స్వగృహంలో తొట్టంబేడు మండలంలోని చిట్టత్తూరుకు చెందిన వైసీపీ నాయకుడు చిల్లకూరు చెంగారెడ్డి ఆధ్వర్యంలో పంచాయతీ వార్డు మెంబర్లు మందా సుబ్రహ్మణ్యం, గురునాథం టీడీపీలో చేరారు. టీడీపీలో చేరినవారు మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే అక్రమాలు, అరాచకాలు చూడలేక తెలుగుదేశంలో చేరామన్నారు. మునిరాజనాయుడు, వెంకటాచలం, బాలాజీరెడ్డి, ప్రతాప్, బాబురెడ్డి, వేణురెడ్డి, వెంకటయ్య మణి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోండి

● నార్నె వెంకటసుబ్బయ్య


సమావేశంలో మాట్లాడుతున్న నార్నె వెంకటసుబ్బయ్య

తిరుపతి(ఆటోనగర్), మార్చి 8: వరదయ్యపాళెం మండలంలోని కల్కి ఆశ్రమం ఆధీనంలో గల 3.74 ఎకరాల ప్రభుత్వ భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని ఏపీ హేతువాద సంఘం నాయకుడు నార్నె వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. 16 ఏళ్లుగా 3.74 ఎకరాల ప్రభుత్వ భూములు కల్కి ఆశ్రమం పరిధిలో ఉన్నాయని, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో హైకోర్టులో వ్యాజ్యం వేశామని తెలిపారు. గత జనవరి పదో తేదీన హైకోర్టు ఆ స్థలం ప్రభుత్వానిదేనని తీర్పు ఇచ్చినా అధికారులు స్వాధీనం చేసుకోకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఈ కేసులో అక్రమాలకుపాల్పడిన ఆశ్రమ పీఠాధిపతి విజయకుమార్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారులు స్పందించని పక్షంలో కోర్టులో కంటెంట్ కేసు వేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో హేతువాద సంఘ నాయకులు డి.కోటేశ్వర్‌రావు, రామ్మూర్తిరెడ్డి పాల్గొన్నారు.

జమ్మూ కశ్మీర్ గవర్నర్‌కు స్వాగతం



రేణిగుంట, మార్చి 8: జిల్లాలో రెండ్రోజుల పర్యటన నిమిత్తం శుక్రవారం మధ్యాహ్నం జమ్మూ కశ్మీర్ గవర్నర్ మనోజ్‌సిన్హా తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్నారు. ఆయనకు కలెక్టర్ లక్ష్మీశ స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన ముక్కంటి దర్శనానికి వెళ్లారు. శనివారం తిరుమలలో శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణం కానున్నారు. ఎస్డీసీ భాస్కర్‌నాయుడు, లైజన్ అధికారి లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

స్త్రీశక్తి అవార్డుకు బొప్పన సాయి హారిక

వరదయ్యపాళెం, మార్చి 8: వరదయ్యపాళెంకు చెందిన బొప్పన సాయి హారిక స్త్రీశక్తి అవార్డుకు ఎంపికైంది. మాటలు రాని, వినికిడి లోపం ఉన్న వారికి ఆమె చేసిన కృషికి ఈ అవార్డు దక్కింది. బెంగళూరులోని హోసూరు నగరంలో శుక్రవారం ఈ అవార్డును అందుకున్నారు.

నేటినుంచి ఆర్గానిక్ మేళా

తిరుపతి రూరల్, మార్చి 8: తిరుపతి యూత్ హాస్టల్ క్రీడామైదానం వేదికగా కనెక్ట్-2 ఫార్మర్ రైతుల సంస్థ ఆధ్వర్యంలో శనివారం నుంచి సోమవారం వరకు ఉదయం 6.30నుంచి రాత్రి 8గంటల వరకు ఆర్గానిక్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎటుచూసినా శివనామస్మరణే


సూళ్లూరుపేటలోని సంతానేశ్వరస్వామి అభిషేకానికి కాళంగి నది నుంచి జలాలను తీసుకెళ్తున్న భక్తులు


చిట్టమూరు: యాకసిరితిప్పపై శివలింగాలకు భక్తుల పూజలు

గూడూరు, మార్చి 8: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివాలయాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. ఆలయాల్లో శివలింగాలను ప్రత్యేకంగా అలంకరించి శివుడికి అభిషేకాలు, హోమాలు జరిపారు. శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. గూడూరు పట్టణంలోని శివాలయం, వీరభద్రస్వామి ఆలయం, సోమసుందేశ్వరస్వామి ఆలయాల్లో శివలింగాలకు భక్తులు పూజలు జరిపి అభిషేకాలు నిర్వహించారు. సాయిసత్సంగ నిలయంలో నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో శివలింగానికి అన్నాభిషేకం చేశారు. శివపార్వతుల కల్యాణాన్ని నిర్వహించారు. స్థానిక బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో ప్రత్యేకంగా వాయు శివలింగాన్ని ఏర్పాటు చేశారు. రుద్రాక్ష, మంచు శివలింగాలను ఏర్పాటు చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

చిల్లకూరు: మండలంలోని చేడిమాల గ్రామంలో వెలసిన కామాక్షీ సమేత నాగలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు కల్యాణం జరిపారు. బూదనంలోని భవానీ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించారు. ఏరూరులోని జ్ఞానప్రసూనాంబ కాళహస్తీశ్వర ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రికి స్వామి, అమ్మవార్లకు వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ కల్యాణం జరిపారు.

డక్కిలి: మండలంలోని దేవునివెల్లంపల్లి స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయంలో పిండిదీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే వెంబులూరు సమీపంలోని యోగ లక్ష్మీనరసింహ స్వామి, మోపూరు శివాలయం, డక్కిలిలో ప్రసన్న వెంకటేశ్వర్ల స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

వాకాడు: మండలంలోని తిరుమూరు భీమేశ్వరాలయం, పంట్రాగం కామాక్షీ దేవి, పాండురంగేశ్వరస్వామి, రామలింగేశ్వరస్వామి, వాకాడు నాగేశ్వరాలయం, జువ్వినట్టు అన్నపూర్ణసమేత కాశీవిశ్వేశ్వరాలయం, తూపిలి బ్రహ్మలింగేశ్వర స్వామి భక్తులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో స్వామి అమ్మవార్లకు కల్యాణ మహోత్సవం జరిపించారు. పంట్రాంగం ఆలయంలో భక్తిపాటలు పాటకచ్చేరి చేపట్టారు.

కోట: గూడలి కొండపై వెలసిన పర్వతవర్ధిని సమేత భీమేశ్వరాలయంలో మూలవిరాట్‌కు అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. నేదురుమల్లి ఫౌండేషన్ చైర్మన్ రాంకుమార్‌రెడ్డి, వైసీపీ సీఈసీ సభ్యుడు కొడవలూరు ధనంజయరెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ భీమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. గూడలిలోని స్వర్ణముఖినది ఒడ్డున వెలసిన కామాక్షీదేవి సమేత సంఘమేశ్వరుడికి పలు అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో గూడలి పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అదే విధంగా వంజివాకలోని జలసిద్ధేశ్వరి ఆలయం, పుచ్చలపల్లిలోని శ్రీకాళహస్తీశ్వర ఆలయం, అల్లంపాడు, కొత్తపట్నంలోని పురాతన శివాలయాల్లో శివరాత్రి ఉత్సవాలు నిర్వహించారు.

సూళ్లూరుపేట: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని నాగేశ్వరస్వామి ఆలయంలో మూల విరాట్‌ను అభిషేకించారు. ఉదయం స్వామివారికి అరుణోదయాభిషేకం, మధ్యాహ్నం తపనోదయాభిషేకం, సాయంత్రం ప్రదోష కాలాభిషేకం, రాత్రి స్వామివారికి లింగోద్భవ కాలాభిషేకం చేశారు. అదేవిధంగా మన్నారుపోలూరు కాళంగి నదీ తీరాన వెలసిన సంతానేశ్వరస్వామి ఆలయానికి తెల్లవారుజామున నుంచే భక్తులు పోటెత్తారు. సంతాన ప్రాప్తికోసం వందలాది మంది జంటలు బిందెలు, చెంబులతో కాళంగి నది జలాలను తెచ్చి శివలింగాన్ని అభిషేకించారు. అటీడీపీ కార్యాలయం వద్దనున్న అభయ శంకరుడికి అభిషేకాలు చేశారు.

పెళ్లకూరు: మండలంలోని శిరసనంబేడు, పెళ్లకూరు, చిల్లకూరు వడ్డిపాళెం, చింతపూడి గ్రామాల్లో మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని శివాలయాల్లో శివలింగాలకు అభిషేకాలు చేశారు.

చిట్టమూరు: మండలంలోని మల్లాం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం, యాకసిరి తిప్ప భూపతేశ్వర స్వామి, పాటిమిట్ట నగరేశ్వర స్వామి, గునపాడు నాదేశ్వర స్వామి, పెళ్ళకూరు మల్లీశ్వర స్వామి, చిట్టమూరు శివాలయం, మల్లాం కామాక్షి, సమేత మార్కెండేశ్వర స్వామి ఆలయాల్లో శివరాత్రి వేడుకలు జరిగాయి. తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీవారి సన్నిధికి దూరమై... మనసు భారమై
తిరుమల ఆలయ మహద్వారం ముంగిట విలపించిన టీటీడీ ఉద్యోగి




తిరుపతి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అది తిరుమల శ్రీవారి ఆలయ ప్రవేశ మార్గం... శుక్రవారం ఉదయం సుమారు 11 గంటల వేళ.... ఆలయం నుంచీ అర్చకుడిలా వున్న ఓ వ్యక్తి విషణ్ణ వదనంతో వెలుపలికి వచ్చారు... మహద్వారం ముంగిట సాష్టాంగ ప్రమాణం చేశారు... ఆపై లేచి నుంచుని పట్టరాని దుఃఖంతో అక్కడి నుంచీ నిష్క్రమించారు... ధారాపాతంగా కారుతున్న కన్నీటిని ఉత్తరీయంతో తుడుచుకుంటూ సాగిపోతున్న ఆయన్ను చూసి మీడియా ప్రతినిధులు ఏమి జరిగిందంటూ ప్రశ్నించినా సమాధానం చెప్పకుండా చేతులెత్తి నమస్కరించారు. ఏడుస్తూనే వీడియో తీయొద్దని వారిస్తూ ముందుకు సాగిపోయారు. శ్రీవారి ఆలయం నుంచీ విలపిస్తూ నిష్క్రమించిన ఆయన ఎవరా అని ఆరా తీస్తే బదిలీ కారణంగా భారమైన మనసుతో శ్రీవారి సన్నిధికి దూరమైన ఉద్యోగి గురురాజారావు అని తెలిసింది. టీటీడీలో 2002వ సంవత్సరం గురురాజారావు టెంపుల్ ఇన్స్‌పెక్టర్ హోదాలో ఆలయ విధుల్లో చేరారు. ఆపై బొక్కసం క్లర్కుగా తర్వాత బొక్కసం సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందారు. టీటీడీలో బొక్కసం సూపరింటెండెంట్ అన్న ఉద్యోగం కీలకమైనదే కాక సంక్లిష్టమైంది కూడా. ఆలయంలో శ్రీవారి బంగారు, వెండి ఆభరణాలన్నీ ఆయన ఆధీనంలోనే, పర్యవేక్షణలోనే వుంటాయి. శ్రీవారి మూలమూర్తికి అలంకరించే ఆభరణాలు, ఉత్సవ మూర్తులకు అలంకరించే నగలు కూడా ఆయనే బొక్కసం నుంచీ ఎంపిక చేసి తీసుకెళ్ళి ప్రధాన అర్చకులకు అప్పగించడం, వాటిని తొలగించాక తిరిగి బొక్కసానికి చేర్చి భద్రపరచడం ఆయన ప్రధాన విధి. ఈ విధుల్లో భాగంగా ఆలయంలో రోజువారీ స్వామివారికి జరిగే నిత్య కైంకర్యాలపైన, పూజలు, ప్రత్యేక పూజా పునస్కారాలమీద ఆయనకు విశేషమైన అనుభవం కూడా వుంది. నిత్యం అర్చకులకు సహకరించే క్రమంలో ఆయనకు రోజువారీ ఆలయంలో శ్రీవారి పూజా కైంకర్యాల గురించి సమగ్ర అవగాహన తెచ్చుకున్నారు. దానికి తోడు డాలర్ శేషాద్రి మరణించే వరకూ ఆయన వెన్నంటి వుండి శ్రీవారి దర్శనార్థమై వచ్చే మఠాధిపతులకు, పీఠాధిపతులకు కూడా ప్రీతిపాత్రుడయ్యారని సమాచారం. ఆలయ వ్యవహారాల్లో ఇటు అర్చకులకు, అటు అధికారులకు నడుమ సంధానకర్తగా వ్యవహరిస్తూ ఆలయ నిర్వహణలో కీలక వ్యక్తిగా మారారు. గత 20 ఏళ్లలో టీటీడీలో పనిచేసిన ఉన్నతాధికారులందరి వద్దా మన్ననలు పొందారు.విధి నిర్వహణలో ఎలాంటి ఆరోపణలు, ఫిర్యాదులు కూడా లేవని, వివాద రహితుడిగా పేరుపడ్డారని తెలిసింది. అయితే ఆ క్రమంలో కొంతమంది అధికారుల ఈగో కారణంగా బొక్కసం సూపరింటెండెంట్ విధులకు దూరమైనట్టు తెలిసింది. 2020లో ఆయన్ను బొక్కసం సూపరింటెండెంట్‌గా తప్పించి తిరుమలలోనే వైభవోత్సవ మండపానికి బదిలీ చేశారు. శ్రీవారి బంగారం, వెండి ఆభరణాలు పర్యవేక్షించే బాధ్యతల నుంచీ తప్పించినా కనీసం తిరుమలలోనే విధులు కేటాయించినందుకు సంతోషిస్తూ అక్కడే విధుల్లో కొనసాగారు. అయితే బొక్కసం విధుల నుంచీ తప్పించడంతో సంతృప్తి చెందని కొందరు అధికారులు కక్షసాధింపుతో ఆయన్ను తాజాగా తిరుమల నుంచే బదిలీ చేయించారని సమాచారం. తిరుపతి టీటీడీ పరిపాలనా భవనంలోని అకౌంట్స్ విభాగానికి బదిలీ చేసినట్టు తెలిసింది. 22 ఏళ్ళుగా తిరుమలలో శ్రీవారి సన్నిధిలో గడిపిన ఆయన బదిలీ కారణంగా తిరుమల వీడాల్సి రావడంతో హతాశులయ్యారని సమాచారం. దీంతో శుక్రవారం విచార వదనంతో ఆలయం వీడిన ఆయన మహద్వారం ముంగిట శ్రీవారికి ప్రణమిల్లి కన్నీరు కారుస్తూ వైభవోత్సవ మండపం వైపు వెళ్ళిపోవడం చూపరులను కలచివేసింది. శ్రీవారి పట్ల, ఆలయ విధుల పట్ల ఆయనకున్న భక్తిప్రపత్తులు అక్కడున్న వారి మనసులను కదిలించింది.

వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలు




గాజులమండ్యం మూలస్థానేశ్వరుడు - గుడిమల్లంలో కల్యాణోత్సవం - శ్రీకాళహస్తిలో అర్ధనారీశ్వరుడు

నాగలాపురం, మార్చి 8: సురుటుపల్లె పళ్లికొండేశ్వరాలయంలో శుక్రవారం మహాశివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. వాల్మీకేశ్వర స్వామి, అమ్మవార్లను వృషభ వాహనంపై అధిష్టింపచేసి తిరువీధుల్లో ఊరేగించారు. ఈ పూజలకు ఆలయమాజీచైర్మన్ ఏవీఎం మునిశేఖర్ రెడ్డి ఉభయ దారులుగా వ్యవహరించారు. టీటీడీ తరఫున సూపరింటెండెంట్లు ఉమామహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, మధుసూదన్‌రెడ్డిలు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. వీరికి ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీరెడ్డి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు.

రేణిగుంట: గాజులమండ్యంలోని కామాక్షి సమేత మూలస్థానేశ్వర స్వామి ఆలయంతోపాలు పలు ఆలయాల్లో శివరాత్రి వేడుకలు జరిగాయి.

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. సుమారు 15వేల మంది భక్తులు దర్శించుకున్నారని ఆలయ చైర్మన్ నరసింహయాదవ్ తెలిపారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే తనయుడు ఆకర్షరెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించారు.

పిచ్చాటూరు: మండలంలోని రామగిరి వాలీశ్వర స్వామి, కీళపూడి జలకంఠేశ్వర స్వామి ఆలయాల్లో వేడుకలు జరిగాయి. ఆరే సిద్ధలయ్య కోన భక్తులతో కిక్కిరిసింది.

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన అర్ధనారీశ్వర స్వామి ఆలయాన్ని సుమారు 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. అలాగే జెట్టిపాలెంలోని చక్రేశ్వర స్వామి ఆలయం, పానగల్ రోడ్ లోని సర్వ సంపత్ ప్రదేశ్వరాలయం, విజ్ఞానగిరి కొండపై ఉన్న శివాలయం, కుందేటి వారి వీధిలోని బృహదీశ్వరాలయం, శ్రీకాళహస్తి మండలం వేడం రోడ్ లోని జ్ఞానప్రసూనాంబికా సమేత సమేత ముఖేశ్వర స్వామి ఆలయం, ప్రాజెక్టు వీధుల వెలసిన శివాలయం తదితర ఆలయాల్లోనూ శివరాత్రి సందడి నెలకొంది.

బీవీపాళెం చెక్‌పోస్టులో బంగారం స్వాధీనం
జీఎస్టీ చెల్లించలేదంటూ నోటీసులు

తడ, మార్చి 8: జీఎస్టీ చెల్లించకుండా తరలిస్తున్న బంగారు ఆభరణాలను ఎస్‌ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం అర్ధరాత్రి సమయంలో భీములవారిపాళెం చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఈబీ అధికారులు తనిఖీలు చేస్తుండగా చెన్నై నుంచి నెల్లూరు వెళ్తున్న ఓ వ్యాన్‌లో బంగారు ఆభరణాలను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకొని విచారించగా ముంబాయికి చెందిన ఓ సంస్థ పక్కా బిల్లులతో సుమారు 653 గ్రాముల ఆభరణాలు చెన్నైకు తరలించింది. వాటిని నెల్లూరుకు తరలించేందుకు ఒక శాతం జీఎస్టీ చెల్లించకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ.35 లక్షల విలువైన ఈ ఆభరణాలకు జీఎస్టీ పెనాల్టీ చెల్లించాలంటూ సదరు సంస్థకు నోటీసులు జారీచేసి ఆ ఆభరణాలను సీజ్ చేశారు.

మిగులు భూములను పేదలకు పంచండి

వెంకటగిరి, మార్చి 8: ప్రభుత్వ మిగులు భూములను పేదలకు పంచిపెట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. మండలంలోని పెట్లూరు సర్వే నెంబరు 1లో 238 ఎకరాలు, సర్వే నెంబరు 12లో 512 ఎకరాల్లో సీపీఎం జెండాపాతి భూ పోరాటానికి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన నాగరాజు మాట్లాడుతూ గత పదేళ్ల నుంచి ఈ భూముల్లోకి పేదలు వెళ్లకుండా అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీశాఖకు చెందిన భూములే అయితే ఇదే సర్వే నెంబరులో జగనన్న ప్లాట్లు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. రికార్డుల పరంగా ఈ భూములు రెవెన్యూశాఖకు చెందినవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో చెంగయ్య, పద్మమ్మ, రమణయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లోనూ రాణిస్తున్న ఆధునిక మహిళలు



ప్రభుత్వాస్పత్రిలో మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న వాకర్స్ అసోసియేషన్

పుత్తూరు అర్బన్, మార్చి 8: అనాదిగా వస్తున్న కట్టుబాట్లను, పురుషాధిక్యతను ఎదిరించి ఆధునిక మహిళలు అన్ని రంగాల్లోను రాణిస్తూ తనకు తానే సాటిగా నిరూపించుకుంటున్నారని వాకర్స్ అసోసియేషన్ ఇంటర్నేషనల్ చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ రవిరాజు కొనియాడారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులను సత్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. మహిళలు రాణించినప్పుడే ఆ దేశం పురోభివృద్ధి సాధిస్తుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో గవర్నర్ ఎలెక్ట్ మాధవనాయుడు, పుత్తూరు అసోసియేషన్ అధ్యక్షుడు కేఎల్‌ఎన్ మూర్తి, కార్యదర్శి మునికృష్ణయ్య, జయరామానాయుడు, యుగంధర్‌రాజు, మురగారెడ్డి, కుప్పయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

వేడుకగా పద్మావతమ్మ ఊంజలసేవ



నారాయణవనం, మార్చి 8: నారాయణవనంలో వెలసిన కల్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజలసేవ శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామి, పద్మావతి అమ్మవార్లకు నిత్య కైంకర్యాలు నిర్వహించి, ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. సాయంత్రం అమ్మవారికి నూతన పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చారణతో ఊంజలసేవ ను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, ఆలయాధికారి నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

మీ చదువు... మా బాధ్యత


కరపత్రాలను విడుదల చేస్తున్న టీడీపీ మహిళా నాయకులు

పుత్తూరు అర్బన్, మార్చి 8: మీ చదువుకు మా బాధ్యతని టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కళ్యాణ్ సమష్టిగా కలలకు రెక్కలు పథకాన్ని తీసుకురావడం చరిత్రాత్మకమని తెలుగు మహిళా నాయకులు కొనియాడారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ మహిళలు అభివృద్ధి సాధించాలంటే వారికి విద్యా అవకాశాలు కల్పించాలనే మహోన్నత ఆశయంతో విద్యార్థినిల కోసం కలలకు రెక్కలు పథకం ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇంటర్మీడియట్ పూర్తైన ప్రతి విద్యార్థిని దేశంలోని ఏ కళాశాలలోనైనా ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం భుజాలపైకి ఎత్తుకోవడమే కాకుండా, అందుకు మంజూరు చేసిన రుణానికి వడ్డీని ప్రభుత్వం చెల్లించే విధంగా కలలకు పథకాన్ని టీడీపీ, జనసేన రూపొందించాయని సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రతి ఆడబిడ్డకు అండగా ఉంటూ వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్ నూతన పథకాన్ని ప్రకటించడం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వారిద్దరికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కలలకు రెక్కలు పథకంపై ఇంటింటి ప్రచారం నిర్వహిస్తామని వారు ప్రకటించారు. సమావేశంలో తెలుగు మహిళా అధికార ప్రతినిధి మీరా, చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి యాళ్ల లక్ష్మీప్రసన్న, అధికార ప్రతినిధి బసంతి, నియోజకవర్గ అధ్యక్షురాలు సంపూర్ణమ్మ, తొమ్మిదవ వార్డు కౌన్సిలర్ రాధా అశోక్, తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి నాగరత్న, ఎం.ఉషారాణి, సుజాత, రజని, గుణభూషణమ్మ, గాలి లక్ష్మి, తెలుగు మోహన, రజియా తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు



సదాశివకోనలో జలపాత స్నానం చేస్తున్న భక్తులు - విశేష అలంకరణలో సదాశివుడు

పుత్తూరు/పుత్తూరు అర్బన్, మార్చి 8: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పుత్తూరు పట్టణంలోని సదాశివేశ్వరాలయం, తడుకు పంచాయతీలోని నాగిలేరు వద్ద ఉన్న శివాలయాలు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. వేకువజామునే స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. సదాశివకోనకు వెళ్లే భక్తులు నాగిలేరు వద్ద వున్న శివాలయంలో పూజలు చేసి బయలుదేరారు. నాగిలేరులోని శివాలయంలో, పట్టణంలోని సదాశివేశ్వరాలయంలో మంత్రి రోజా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల చైర్మన్లు, కమిటీ సభ్యులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు. తొరూరులోని శివాలయం, పట్టణంలోని కామాక్షీ సదాశివేశ్వరస్వామి ఆలయం, ఎన్‌జీవో కాలనీ గుట్టపై ఉన్న ఆలయం, చలమేశ్వరస్వామి కోనలో స్వామి వారిని నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భానుప్రకాష్‌కు పూర్ణ కుంభం స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య, పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎస్ ధనపాల్, మండలాధ్యక్షుడు రవికుమార్ పాల్గొన్నారు.

నారాయణవనం: కైలాసనాథ కోనలో కామాక్షింభిక సమేత కైలాసనాధుని సేవలో ఉదయం కైలాసనాధునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. మూలమూర్తిని సుగంధ పుష్పాలతో అలంకరించారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అలాగే చంపకవల్లీ పరాశరేశ్వర, మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వర ఆలయంతో పాటు తుంబూరు తుంబీశ్వర స్వామి, పాలమంగళం పాలీశ్వరస్వామికి వేకువజామున ఆర్జిత అభిషేకాలు నిర్వహించారు. బిల్వదళాలతో అర్చనలు చేశారు. కైలాసనాథ కోనలో భక్తులు స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు సేవలందించారు.

వడమాలపేట: సదాశివకోనలోని సదాశివేశ్వర స్వామికి శుక్రవారం వేకువజామున లింగోద్భవ అభిషేకం జరిగింది. భక్తులు వేలాదిగా తరలివచ్చి జలపాతాల్లో స్నానం చేసి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వడమాలపేట, ఏర్పేడు, పుత్తూరు మండలాలకు చెందిన పలు అన్నదాన సంఘాలు భక్తులకు మూడు రోజులపాటు అన్నదానం చేశారు. అలాగే ఓబీఆర్ కండ్రిగ వెదళ్ల చెరువు వద్ద ఉమామహేశ్వరస్వామి ఆలయంలో భస్మాసుర అభిషేకం, చండీ హోమం నిర్వహించారు. అరుణగిరి కొండ చుట్టు ఉత్సవంలో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. టీఆర్ కండ్రిగలోని నాగలక్ష్మి ఆలయంలో రుద్రాభిషేకం, రుద్రహోమం నిర్వహించారు.




పుత్తూరు మండలంలోని నాగిలేరు శివాలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న మంత్రి రోజా, తొరూరులోని శివాలయం వద్ద గాలి భానుప్రకాష్, నారాయణవనంలోని కైలాసనాధుడి ఆలయం వద్ద సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం

శ్రీకాళహస్తి
సత్యవేడు



ముక్కంటి దర్శనానికి వచ్చిన భక్తుల రద్దీ



స్వామి, అమ్మవార్ల పురవిహారం



క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

శంభో శంకర..!

శివనామస్మరణతో మార్మోగిన శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి, మార్చి 8: మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం ఉదయం నుంచే దక్షిణ కైలాసంగా విరాజిల్లుతున్న ముక్కంటి ఆలయానికి భక్తులు పోటెత్తారు. వాయులింగేశ్వరుడు నిజమూర్తి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున రెండు గంటలకే స్వామి, అమ్మవార్లను మేల్కొలిపారు. గోపూజ నిర్వహించాక పవిత్రస్నానం చేసిన గోవు స్వామి, అమ్మవార్లను మొదట దర్శించుకుంది. సుప్రభాత సేవ తర్వాత మూడు గంటలనుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. రాజగోపురం సమీపం నుంచి సామాన్య భక్తుల కోసం ఉచిత దర్శనానికి, రూ.50 టికెట్లు కొనుగోలుచేసిన వారికి క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయం లోపల మహాలఘుదర్శన విధానం అమలు చేశారు. స్వర్ణముఖిలో తర్పణాలు విడిచేందుకు ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లలో భక్తులకు తాగునీరు, మజ్జిగ, పాలు, బిస్కెట్లు అందజేశారు. సుమారు లక్షన్నర మంది దర్శించుకుని ఉంటారని ఆలయాధికారుల అంచనా.

ఐదు వైద్య శిబిరాలు: ఆలయంలో భక్తుల రద్దీ దృష్ట్యా ఐదు వైద్య శిబిరాలను నిర్వహించారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి నుంచి సీనియర్ వైద్యాధికారులు, స్టాఫ్ నర్సులను కేటాయించారు. అన్నదాన సత్రం పక్కన ఆక్సిజన్ వ్యవస్థతో అత్యవసర సేవలకు అవసరమైన ఏర్పాటు చేశారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు: ఉత్సవాల్లో సుమారు 300 మంది స్కౌట్ అండ్ గైడ్స్ సేవలందించారు. దీంతో స్కౌట్ కమిషనర్ రమేష్ బాబు సేవలను ఆలయ అధికారులు ప్రశంసించారు.

లక్ష వాటర్ బాటిళ్ల వితరణ: శ్రీకాళహస్తీశ్వరాలయానికి కోకో కోలా కంపెనీ లక్ష వాటర్ బాటిళ్లను వితరణ చేసింది.

భక్తులకు అన్నదానం: ఎల్ఐసీ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతోపాటు యంగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థ, గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలోనూ అన్నదానం చేశారు. ఇంకొన్ని సంఘాలవారు నీరు, మజ్జిగ, నిమ్మ రసం పంపిణీ చేశారు.

నిత్యాన్నదానానికి రూ.2లక్షల విరాళం: ముక్కంటి నిత్యాన్నదానం పథకానికి తొట్టంబేడు మండలం ఉపాధ్యాయ నగర్‌కు చెందిన శ్రీనివాసులు రూ.లక్ష, మన్యం జిల్లా మామిడిపల్లికి చెందిన విజయ్ కుమార్ పద్మలత దంపతులు రూ.లక్ష విరాళంగా సమర్పించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

అరవ తిరునాళ్ల (బ్రహ్మరాత్రి) ఉదయం రథోత్సవం, రాత్రి తెప్పోత్సవం (మాఘ బహుళ చతుర్దశి శనివారం)

ఉభయదారులు

ఉదయం: గాజుల సత్యనారాయణ, జయరామరావు వీధి, శ్రీకాళహస్తి.
రాత్రి: ఏర్పేడు మండలం మాధవమాలకు చెందిన రామచంద్రారెడ్డి, శ్రీకాళహస్తికి చెందిన జూలుగంటి రాజేశ్వరమ్మ జ్ఞాపకార్థం జూలుగంటి సత్యనారాయణశెట్టి, మురళిమోహన్ గుప్తా చంద్రశేఖర్

వాహన సేవలిలా..

ఉదయం 11 గంటలకు రథోత్సవం, రాత్రి 8 గంటలకు తెప్పోత్సవం

నిత్య ఉత్సవాలిలా..

- ఉదయం 2 నుంచి 6 గంటలకు లింగోద్భవ దర్శనం
- 6 గంటలకు సర్వదర్శనం ప్రారంభం
- 8.45 గంటలకు స్వామిఅమ్మవార్ల పురవీధుల ఉత్సవం
- 11 గంటలకు స్వామి, అమ్మవార్ల రథోత్సవం
- సాయంత్రం 5 గంటలకు ప్రదోషకాల అభిషేకం
- రాత్రి 8 గంటలకు స్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం
- 9.30 గంటలకు దర్శనం ముగింపు



మహాద్వారం వద్ద పూల అలంకరణ



ఆలయం లోపల , వెలుపల ధ్వజస్తంభం వద్ద ఫల, పుష్పాలంకరణ





అబ్బురం ఆషా అభినయం



తొట్టంబేడు, మార్చి 8: రాష్ట్రపతి అవార్డు గ్రహీత శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన ఎంఎస్ ఆషా అభినయం ఆహూతులను అబ్బురపరిచింది. ధూర్జటి కళా ప్రాంగణంలో చెన్నైకి చెందిన తెలుగుతరణి మ్యూజిక్ గ్రూప్ భక్తిరంజనితో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం ఆషా అకాడమీ బృందం నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పట్టణానికి చెందిన వర్షారెడ్డి, హర్షితసూర్యకుమార్, శ్రీలక్ష్మి కూచిపూడి నృత్యకళాకేంద్రం తెనాలి వెంకటలక్ష్మి నృత్యప్రదర్శనలు అలరించాయి. హైదరాబాద్ ప్రముఖసినీ నిర్మాత టీజీ విశ్వప్రసాద్ సినీ గాయకుల భక్తి సంగీత విభావరి రంజింపజేసింది. లక్ష్మయ్య శ్రీబాలాజీ నాట్యమండలి శ్రీరామాంజనేయ యుద్ధం నాటకంతోకార్యక్రమం ముగిసింది.



స్వర్ణముఖిలో తర్పణం వదులుతున్న భక్తుడు







స్వామి, అమ్మవార్ల ఊరేగింపు ముందు కళాకారుల సందడి

నేడు ముక్కంటి రథోత్సవం, తెప్పోత్సవం



ముస్తాబైన స్వామి, అమ్మవారి రథాలు

శ్రీకాళహస్తి, మార్చి 8: ముక్కంటి రథోత్సవం, తెప్పోత్సవం శనివారం జరగనున్నాయి. స్వామి, అమ్మవార్లు ఉదయం జంట రథాలపై దర్శనమివ్వనున్నారు. రాత్రి 8 గంటలకు విజ్ఞానగిరి సమీపంలోని నారదపుష్కరిణిలో ఏర్పాటు చేసిన తెప్పలపై ఆది దంపతులు విహరించనున్నారు.



నారద పుష్కరిణిలో సిద్ధమైన తెప్పలు

అనధికారికంగా ఒప్పంద ఉద్యోగికి విధులు

శ్రీకాళహస్తి, మార్చి 8: శివరాత్రి ఉత్సవాల హడావుడిలో ఓ ఒప్పంద ఉద్యోగికి ముక్కంటి ఆలయంలో అనధికారికంగా విధులు కేటాయించారు. పది నెలల కిందట పీఆర్వో కార్యాలయం నుంచి ఈ ఉద్యోగిని వేరే విభాగానికి అంతర్గతంగా బదిలీ చేశారు. తనకు అనువైన చోట విధులు కేటాయించలేదని ఆ ఉద్యోగి అప్పటి నుంచి అనధికారికంగా గైర్హాజరవుతూ వచ్చారు. 20 రోజుల కిందట రాజకీయ అండతో మళ్లీ గుట్టుచప్పుడు కాకుండా విధుల్లో చేరడానికి సిద్ధమయ్యాడు. దీనిపై విమర్శలు రావడంతో ఆ ఉద్యోగిని మళ్లీ పక్కన పెట్టారు. ప్రస్తుతం ఈవో ఆదేశాలకు లేకుండా పది నెలల నుంచి దూరంగా ఉన్న ఉద్యోగికి శివరాత్రి విధుల పేరుతో డ్యూటీ కేటాయించారు. దీనిపై మళ్లీ అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి.

అమాంతం పెరిగిన అలంకరణ అంచనా?

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు పూల, పండ్ల అలంకరణ కోసం అమాంతంగా అంచనా పెంచినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల జరిగిన ఉత్సవాల సమీక్ష సమావేశంలో పూల, పండ్ల అలంకారం కోసం రూ.40లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అయితే దాన్ని రహస్యంగా రెట్టింపు చేసినట్లు తెలుస్తోంది.



పూల అలంకారంలో శివలింగం నంది - ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆర్టీసీ వైస్‌చైర్మన్ మిద్దెల హరి

తొండమాన్‌పురంలో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

తొట్టంబేడు, మార్చి 8: శ్రీకాళహస్తి మండలంలోని తొండమాన్‌పురంలోని శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు శుక్రవారం అంకురార్పణ జరిగింది. కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

పరశురామేశ్వరస్వామి సేవలో మహారాష్ట్ర సీఎం తనయుడు



శ్రీకాంత్‌షిండే, రాజేష్‌కు స్వాగతం పలుకుతున్న బొజ్జల సుధీర్‌రెడ్డి

ఏర్పేడు, మార్చి 8: గుడిమల్లంలోని పరశురామేశ్వర స్వామిని శుక్రవారం మహారాష్ట్ర సీఎం ఏకనాథ్‌షిండే కుమారుడు శ్రీకాంత్ షిండే దర్శించుకున్నారు. ఆయన వెంట రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ కుమారుడు సీఎం రాజేష్ ఉన్నారు. వీరికి శ్రీకాళహస్తి టీడీపీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు, మాజీ జడ్పీటీసీ పేరం ధనంజయులనాయుడు, గుడిమల్లం మాజీ సర్పంచ్ పద్మనాభనాయుడు, నాగరాజునాయుడు స్వాగతం పలికారు.

బత్తినయ్య దయతోనే ఇంతటి వాడినయ్యా

సినీ నటుడు సత్యప్రకాష్



కుటుంబీకులతో సత్యప్రకాష్

కేవీబీపురం మార్చి 8: బత్తినయ్య స్వామి దయ వల్లే తాను ఇంతవాడినయ్యానని సినీ నటుడు సత్యప్రకాష్ తెలిపారు. ఏటా తన స్వగ్రామం పెరిందేశంలోని బత్తినయ్య స్వామి, అమ్మవార్లకు మహాశివరాత్రి సందర్భంగా పూజలు చేసి.. అన్నదానం చేయడం ఆనవాయితీ అన్నారు. స్వామి ఆశీస్సులతో తన కుమారుడు కూడా త్వరలో సినీరంగ ప్రవేశం చేస్తున్నాడన్నారు.

గౌతమ్ గంభీర్‌కు ఘన స్వాగతం



రేణిగుంట, మార్చి 8: తిరుపతి విమానాశ్రయంలో ప్రముఖ క్రికెటర్ గౌతమ్ గంభీర్‌కు ఘనస్వాగతం లభించింది. శుక్రవారం మధ్యాహ్నం ఢిల్లీ నుంచి ఎయిర్‌ఇండియా విమానం ద్వారా విమానాశ్రయంలో కుటుంబ సమేతంగా చేరుకున్నారు. అభిమానులు స్వాగతం పలుకగా, విమానాశ్రయం వెలుపల భద్రతా సిబ్బంది ఆయనతో ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. అనంతరం రోడ్డుమార్గం గుండా ఆయన తిరుమలకు బయల్దేరి వెళ్లారు.

సత్యవేడులో పోలీసుల కవాతు



సత్యవేడు, మార్చి 8: సార్వత్రిక ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో ప్రజలు నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలీసు అధికారులు సన్నద్ధమయ్యారు. ఇందులో భాగంగా శుక్రవారం సత్యవేడులో డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. సీఐ దివాకర్‌రెడ్డి, ఎస్ఐ వీరాంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి: బీజేపీ

తొట్టంబేడు, మార్చి 8: కేంద్రప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఆదరించాలని శ్రీకాళహస్తి నియోజకవర్గ బీజేపీ కోకన్వీనర్ సుబ్రహ్మణ్యంరెడ్డి అన్నారు. చిన్నకనపర్తిలో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. నేతలు కృష్ణయ్య, రవిఆచ్చారి, మునిరాజ తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్ పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 8: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో వైఎస్ఆర్ ఆసరా మెగా చెక్‌ను డ్వాక్రా మహిళలకు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గురుమూర్తి, సత్యవేడు వైసీపీ సమన్వయ కర్త నూకతోటి రాజేష్, నియోజకవర్గ జేఏసీ కన్వీనర్ వేలూరు రాకేష్, ఎంపీపీ సుబ్బలక్ష్మి, మండల కన్వీనర్ విద్యానాథరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు: హెలెన్



జానికాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న హెలెన్

సత్యవేడు, మార్చి 8: టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్ సాధ్యమని సత్యవేడు ఇన్‌చార్జి హెలెన్ తెలిపారు. నాగలాపురం మండలంలోని జానికాపురంలో శుక్రవారం పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్ ఆధ్వర్యంలో బాబు సూపర్ సిక్స్ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి కుమార్, మండల ప్రధాన కార్యదర్శి పార్దిబన్, రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడు కొండూరు బాలరాజు, పరశురాం శిల్పి, బాబు, శేఖర్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేణిగుంట, మార్చి 8: తూకివాకం, కరకంబాడి, గురవరాజుపల్లి, ఎల్లమండ్యం, కురకాలువ సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ, ఎల్‌టీ లైన్లకు ఆటంకం కలిగించే చెట్లను శనివారం తొలగించనున్నారు. దీనివల్ల ఈ ప్రాంతాల పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని డీఈ ప్రభాకర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎన్నికల వేళ..మరో ఏడాది

- శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొనసాగింపు
- కొంతమందిని తొలగించి.. మరి కొందరికి అవకాశం

శ్రీకాళహస్తి, మార్చి 8: శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి పాలనా కాలాన్ని మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పాలక మండలి చైర్మన్‌గా అంజూరు శ్రీనివాసులు కొనసాగగా పలువురు సభ్యులను తొలగించి కొత్తవారికి అవకాశం కల్పించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో వుంచుకుని ప్రధానంగా పట్టణంలో బీసీ, బలిజ కులాల ఓట్లను ఆకర్షించేలా బోర్డులో పలువురు సభ్యులకు అవకాశం కల్పించినట్లు తెలుస్తోంది.ఎమ్మెల్యే మధుకు అనుకూలంగా ఉన్న వారందరికీ బోర్డులో తిరిగి స్థానం దక్కగా కొత్తగా ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ దివంగత శ్రీరామమూర్తి అన్న కొండుగారి కృష్ణకుమార్‌కు అవకాశం కల్పించారు. అలాగే నాయీ బ్రాహ్మణులకు సంబంధించి ఆవులపాటి శ్రీనివాసులు, అరుణామెడికల్స్ అధినేత సుబ్బరామగుప్తాకు చోటు కల్పించారు. గతంలో ఉన్న ముగ్గురిని తొలగించి ప్రత్యేక ఆహ్వానితులుగా తొమ్మిదిమందిని నియమించారు. వీరిలో గతంలో టీడీపీలో మాజీ కౌన్సిలరుగా ఉన్న కంఠా ఉదయ్‌కుమార్‌కు ప్రత్యేక ఆహ్వానితులుగా అవకాశం ఇచ్చారు. ట్రస్ట్‌బోర్డులో ఈసారి అవకాశం వస్తుందని ఆశించిన పలువురికి నిరాశే మిగిలింది. ఆర్థికంగా ఉన్నవారికే బోర్డులో పదవులు ఇవ్వడంపై అధికార పార్టీలోనూ అసంతృప్తి వ్యక్తం అవుతోంది. కాగా ఈ మండలికి శివరాత్రి బాగా కలిసొచ్చింది.రెండేళ్ల క్రితం ఫిబ్రవరి 28న అర్ధరాత్రి ముక్కంటి ఆలయానికి ధర్మకర్తల మండలిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పక్కరోజు మార్చి 1న అంజూరు శ్రీనివాసులు చైర్మన్‌గా మండలి ప్రమాణస్వీకారం చేసింది. సరిగ్గా మళ్లీ శుక్రవారం శివరాత్రి రోజున మండలిలో మార్పులు, చేర్పులతో ఏడాది కాలం పొడిగిస్తూ జీవో వెలువడింది. గతంలో లాగే అదే తరహాలో శివరాత్రి రోజున సాయంత్రం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ప్రమాణ స్వీకారం జరిగింది.



పాలకమండలితో ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి

మహిళలు అన్నిరంగాల్లో ముందంజలో ఉండాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రిన్సిపాల్ రాజశేఖర్

శ్రీకాళహస్తి, మార్చి 8: మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ కోరారు. శుక్రవారం కళాశాలలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళా సాధికారత విభాగ అధ్యక్షురాలు శైలజ, కల్చరల్ కోఆర్డినేటర్ పద్మప్రియ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. వైస్ ప్రిన్సిపాల్ దీనదయాళ్, డాక్టర్ మాలతి, గాబ్రియేల్, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ కార్యాలయంలో బొజ్జల రిషితారెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి. పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో జేవీవీ, ఐద్వా ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గఇన్‌చార్జి వినుత కేక్ కట్ చేశారు.

తొట్టంబేడు: సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని బొజ్జల బృందమ్మ అన్నారు. పాతూరులో మహిళలలో కలిసి మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. టీడీపీనాయకులు పాల్గొన్నారు.

రేణిగుంట: మహిళా ఓదార్పు సంఘం ఆధ్వర్యంలో మండల పరిధిలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళలను సన్మానించారు. మహిళా సంఘం అధ్యక్షురాలు పూమామణి, నాయకురాళ్లు లక్ష్మి, తేజోవతి, దివ్య, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో సత్యవేడు టీడీపీ నేత జేడీ రాజశేఖర్ పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చాటిన మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు.